Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమాజం

సంపుటి: 81 • సంచిక: 21 • 21-5-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-





● అధిష్టానంపై తిరుగుబాటుకు జగన్ సంసిద్ధం

సంక్షోభం తప్పదా?

రాష్ట్ర రాజకీయం సంక్షోభ దిశగా ప్రయాణిస్తున్న సూచనలు కన్పిస్తున్నాయి. లైలా తుఫాన్ను మించిన వేగంతో, రాజకీయ పరిణామాలు సుళ్లు తిరుగుతున్నాయి. తీరం దాటడానికి తొందర పడుతున్నాయి. ఈ రాజకీయ తుఫానుకు కేంద్ర బిందువు – వైఎస్.జగన్. తీరం – కాంగ్రెస్ అధిష్టానం. చెలియలి కట్ట – ముఖ్య మంత్రి రోశయ్య.

రాష్ట్ర రాజకీయాలలో తనకు తగిన ప్రాధాన్యత లభించడంలేదని, తనను నిరాదరణకు గురి చేస్తున్నారని, ముఖ్యమంత్రి రోశయ్య తనపై అకారణంగా కేంద్రానికి చాడీలు చెప్తున్నారని, వాటిని నమ్మి అధిష్టానం తనను దూరం పెడుతున్నదని వైఎస్.జగన్‌కు గుర్రుగా వున్న సంగతి అందరికీ తెలిసిందే. వైఎస్ మరణం నాటి నుంచే అటు ముఖ్యమంత్రితో, ఇటు అధిష్టానంతో సత్సంబంధాలు కొనసాగించలేక పోతున్నాడాయన. కెవిపి.రామచంద్రరావు నెలరోజుల క్రితం సంధి కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒకవైపు సంధి అంటూ, మరొకవైపు తన అనుచర మంత్రుల వద్ద హేళనా పూర్వక వ్యాఖ్యలు చేయడం ఏమిటని జగన్ ఆవేశపడుతుంటే, సంధి కోసం తన ఇంటికి వచ్చి కూడా సాక్షి పత్రికలో ప్రభుత్వం చేతకానిదని అదిపనిగా ప్రచారం చేయడం ఏమిటని రోశయ్య ఆవేదన చెందుతున్నాడు.

శాసనసభ సమావేశాలు ముగియగానే గత నెలలో తలపెట్టిన మంత్రివర్గ విస్తరణ జరిపించ లేక పోవడంతో ముఖ్యమంత్రిగా రోశయ్య చాలా బలహీనపడి పోయారు. అది జగన్ అనుచర మంత్రులకు అలుసుగా మారిపోయింది. ఇక తమను ముఖ్యమంత్రి ఏమీ చేయలేడన్న ధీమా నెలకొన్నది. అంతకుక్రితం వరకు తమ పదవులు కాపాడుకోవడానికి ముఖ్యమంత్రి పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తున్న వారంతా పద్ధతి మార్చుకొన్నారు. దీనికి తగినట్లే రోశయ్య కూడా ఈ వర్గం మంత్రులను నమ్మడం లేదు. మంత్రివర్గ సమావేశాలలో పదేపదే వారినుద్దేశించి, సాక్షి పత్రికలో వస్తున్న ప్రభుత్వ వ్యతిరేక కథనాలను ప్రస్తావించి, హేళనా పూర్వక వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ పత్రికగా వుండి, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సంపాదించిన నిధులతో పత్రిక నడుపుతూ ఇటువంటి వార్తలు వ్రాయడం ఏమిటన్నది రోశయ్యగారి ఆవేదన. కానీ జగన్ మాత్రం వీటిని పట్టించుకొనే ధోరణిలో లేడు. తన తండ్రి ప్రారంభించిన పథకాలు, కార్యక్రమాలను రోశయ్య నిర్లక్ష్యం చేస్తున్నాడనే కోపంతో దాదాపుగా ప్రతి రోజూ పథకాల పేరుతో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాడు. వీరిద్దరి మధ్య మంత్రులు నలిగిపోతున్నారు. తాము ఎంత వినయం నటించినా ముఖ్యమంత్రి తమను నమ్మడం లేదన్న అభిప్రాయం ఈ కోవకు చెందిన మంత్రులలో ఏర్పడిపోయింది. నమ్మకంలేని కాపురం చేసే కంటే, అటో ఇటో తేల్చుకోవడమే మేలన్న నిర్ణయానికి వస్తున్నారు. ముఖ్యమంత్రి తమమీద ఇంటెలిజెన్స్ నిఘా పెట్టాడని, తాము తమ కుటుంబ సభ్యులు చేస్తున్న వ్యాపారాల మీద సమాచారం సేకరించి, కేంద్రానికి నివేదికలిస్తున్నాడన్న అనుమానం కూడా కొందరు మంత్రులలో వుంది.

తన ఓదార్పు యాత్రల విజయం తర్వాత జగన్‌లో తొందరపాటు పెరిగిందని చెప్తున్నారు. జనం తనతోనే వున్నట్లు రుజువైంది కాబట్టి, మెజార్టీ ఎమ్మెల్యేలు కల్గిన తాను అనామకంగా అధిష్టానం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బ్రతికే పరిస్థితి ఎందుకన్నది ఆయన వాదన. తానేమిటో కాంగ్రెస్ పెద్దలకు రుచి చూపిస్తే తప్ప ఈ నిరాదరణ వైఖరి మారదని ఆయన భావన. కెవిపి. రామచంద్రరావు వంటి వైఎస్ అనుచరులు ఇంత తొందర వద్దని వారిస్తున్నా విన్పించుకొనే స్థితిలో లేదు జగన్.

ఈ నేపథ్యంలో అమీతుమీ తేల్చుకోవడానికి రాజ్యసభ ఎన్నికలను ఒక వేదికగా వాడుకోవాలని జగన్ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. 18తేది మధ్యాహ్నం ఆయన ఢిల్లీకి వచ్చాడు. ఢిల్లీ పెద్దలను కలిసి, వి.హనుమంతరావుకు ఎట్టి పరిస్థితులలో రాజ్యసభ టిక్కెట్ ఇవ్వడానికి లేదని చెప్పి రావడం ఈ పర్యటన ఉద్దేశం. అంతకు క్రితం రోజు వి.హనుమంతరావు ప్రధానమంత్రిని కలిసి, తన రాజ్యసభ విషయం అడిగాడట. దానికి

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



మనల్ని జనజీవన స్రవంతిలోకి రమ్మంటున్నారేంటి...? బస్సులను పేల్చుతూ, పోలీసులను చంపుతూ ప్రజల్లోనే వుంటున్నాంగా... కామ్రేడ్!

● మంత్రుల నెత్తిన

పాప భారం!

ఎన్ ప్రారంభించిన పథకాలను తాను రద్దు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి రోశయ్య మంచి ఎత్తుగడ వేశాడు. జగన్ నేతృత్వంలోని సాక్షి దినపత్రిక రోశయ్య మీద ఈ ఆరోపణ చేస్తున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదు కాబట్టే, కొన్ని పథకాలను నిలపక తప్పదం లేదని, వైఎస్ బ్రతికి వున్నా ఇదే పని చేసేవాడని రోశయ్య వాదన. కానీ జగన్ అందుకు అంగీకరించడం లేదు. సాక్షి కథనాలు మానడం లేదు.

దీనితో మొన్న 20తేది జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాడు. ఆర్థిక పరిస్థితి బట్టి ఏ పథకం అమలు ఎంతవరకో, దేనికి ఎంత నిధులు ఇవ్వాలో సిఫారసు చేయడం ఈ కమిటీ బాధ్యత. రోశయ్య చాలా తెలివిగా జగన్ అనుచర మంత్రులను మాత్రమే ఇందులో పెట్టాడు. ఆర్థికపరిస్థితి చూసిన తర్వాత వారు కూడా పథకాల నిలుపుదలకు సిఫార్సు చేయక తప్పదు. దానితో వైఎస్ పథకాల నిలిపివేత తన ఒక్కడి పాపం కాదని, ఆయన స్వంత మంత్రుల సిఫార్సు మేరకే అది జరిగిందని ప్రజలకు చెప్పుకోవడానికి అవకాశం దొరుకుతుందన్నది రోశయ్య ఆలోచన. దాని అర్థం పాప భారం మంత్రుల నెత్తిన మోపడమన్న మాట.



కులాల లెక్క

జనాభా లెక్కల సేకరణలో కులాల వారీ జన సంఖ్య సేకరించే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపబోతుంది కేంద్ర ప్రభుత్వం. 80 సంవత్సరాల క్రితం, 1931 జనాభా లెక్కల సేకరణలో ఒక ఆంగ్లేయ అధికారి కులాల సంఖ్యను గణించాడు. అప్పట్లోనే దానిపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆనాటి ఇంగ్లండ్ ప్రభుత్వం ఆయన్ను వివరణ కోరింది. భారతీయ సమాజంలో కులం ఒక అంతర్భాగమని నివేదించాడు. ప్రజలను వారి ప్రతిభ, వృత్తి, ఉద్యోగం వంటి వాటితో కాకుండా పుట్టుకతో వచ్చే కులంతో విడదీసి చూడడం నాగరిక పద్ధతి కాకపోయినా, భారతదేశంలోని ప్రతి గ్రామంలో ప్రజల జీవనశైలి, నివాసాల ఏర్పాటు, సామాజిక హోదా, ఆర్థిక ప్రతిపత్తి, సాంస్కృతిక సరళి, వృత్తుల నిర్వహణ సమస్తం కులాల ప్రాతిపదికన జరుగుతున్న వాస్తవాన్ని కాదనడం సమంజసం కాదని వివరణ ఇచ్చుకొన్నాడు. 80ఏళ్ల తర్వాత కూడా దేశంలో ఇంచుమించు అదే పరిస్థితి ఏర్పడి వుందన్న సంగతి అందరికీ తెలుసు. నిష్ఠూరమనుకోకుండా నిజం మాట్లాడుకోవాలంటే, 80 ఏళ్ల క్రితం కంటే ఈనాడు కులాల ప్రాధాన్యత అధికంగా వుంది. అన్ని సామాజిక అంశాలతోపాటు, రాజకీయం దానికి తోడవడం అందుకు కారణం. దేశ రాజకీయాలలో కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని ఛేదించడానికి విపిసింగ్ ప్రయోగించిన మండల్ కమిషన్ వివాదం రాజకీయ వ్యవస్థ తీరు తెన్నులనే మార్చి వేసింది. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో మొత్తం ఎన్నికల రాజకీయం కేవలం కులాల ప్రాతిపదికనే నడుస్తున్నది. రాజకీయ పార్టీలు కూడా కులాల నేపథ్యంతో పుట్టుకొస్తున్నాయి. దానితో ఏ కులం వారి ప్రాబల్యం ఎంత, ప్రాధాన్యత ఎంత, ప్రాసస్త్యం ఎంత అన్న వివాదం రోజు రోజుకూ ముదురుతున్నది. ఎవరికి వారు తమకు తోచిన లెక్కలతో కులాల ప్రాధాన్యతను ప్రచారం చేస్తున్నారు. వెనుకబడిన తరగతుల వారి విషయంలో ఈ లెక్కల పేచీ అధికంగా వుంది. దేశ జనాభాలో 50 శాతం మంది బిసిలే అని ఒకరంటే, కాదు 70 శాతం అని మరొకరు అంటున్నారు. వారికి పోటీగా బ్రాహ్మణ, క్షత్రియ కులాలవారు కూడా తమ జనాభా ప్రాతిపదికన తమకు రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యమిస్తున్నారు.

ఈ నేపథ్యంలో జనాభా లెక్కల సేకరణలో కులాలను చేర్చడం ఒకవిధంగా సముచిత నిర్ణయమే అవుతున్నది. కులాలు లేని సమాజం కావాలనేది ఒక ఆదర్శం, ఒక సుందర స్వప్నం మాత్రమే. సర్వమానవ సమానత్వం వేదికల మీద ఉపన్యాసాల వరకు బాగుంటుంది. కానీ వాస్తవంలోకి వస్తే మన నిత్య జీవనప్రక్రియలో కులం ప్రమేయం లేకుండా ఏమీ జరగడం లేదన్నది నిజం. కుటుంబపరంగా, సామాజికపరంగా కులాల పరిధి దాటి ఆలోచన చేసే విశాల హృదయం మన ప్రజలలో ఇంకా ఏర్పడలేదు. రాజకీయ పార్టీలు, నేతలు ప్రజలలో అటువంటి సంస్కరణ భావనలు రేకెత్తకుండా ఎప్పటి కప్పుడు కుల ఉద్రేకాలు, చీలికలు రెచ్చగొట్టి, కుల వ్యవస్థను పరిరక్షిస్తున్నారు. యువతీ యువకుల మధ్య కులాంతర వివాహాలు ఎంత విస్తృతస్థాయిలో జరుగుతున్నా, పెళ్లి తర్వాత వారి దాంపత్యంలో కులం ప్రస్తావన తప్పని సరి అవుతున్నది. పెళ్లిళ్లు, చావులు, శుభకార్యాలు వంటి వాటిలో ఏ కులానికి ఆ కులం కొన్ని ప్రత్యేక సాంప్రదాయాలను కలిగి ఉండడమే అందుకు కారణం.

జమీన్‌రైతు

అయితే జనాభా లెక్కల సేకరణలో కులాల వివరాలు కలిపి సేకరించడం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. దేశం మొత్తం మీద 4500లకు పైగా కులాలు వున్నాయని అంచనా. ఒక రాష్ట్రంలో ఒక కులం బిసి అయితే, మరొక రాష్ట్రంలో ఎస్సీగా చలామణి అవుతున్నది. కొన్ని కులాలు ఒకే రాష్ట్రంలో భిన్న ప్రాంతాలలో భిన్న ప్రాధాన్యతలు కలిగి వున్నాయి. ఒకే కులంలోని ఉప కులాలతో మరింత పెద్ద పేచీ వస్తున్నది. ఈ సంక్లిష్టమైన కుల సంఖ్యల సేకరణ తలకెత్తుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పెద్ద భారమే మోయబోతున్నది. జనాభా లెక్కలు కులాల వారీగా వెలువడిన తర్వాత రాజకీయంగా, సామాజికంగా ఎన్ని సమస్యలు పుట్టుకొనివస్తాయో ఊహ కందడం లేదు. దేశ రాజకీయ చరిత్రపటం మొత్తాన్ని కులాల మబ్బులు క్రమ్మివేయడం మాత్రం ఖాయం. దాని పరిణామాలు, ప్రభావాలు భరించక తప్పదు.

జనవాక్కు

జనం ఆలోచించాలి!

సెప్టెంబరు నెలలో నెల్లూరు కార్పొరేషన్‌కు ఎన్నికలు జరుగనున్నాయి. గడచిన ఐదేళ్లలో కార్పొరేషన్ పనితీరును తరచి చూస్తే వీధినాటకాలు, పగటి వేషాలు, నిధుల స్వాహా, వస్త్రాపహరణం, కబ్జాలు తప్ప జరిగిన అభివృద్ధి ఇసుమంతైనా లేదు. కాంగ్రెస్‌పార్టీలోని రెండు గ్రూపులు ఇసుక చల్లుకోని రోజు లేదు. ప్రతిపక్షపార్టీగా తెలుగుదేశం పార్టీ బలంగా వున్నా వారిలో కొంతమంది అధికారపక్షానికి అమ్ముడు పోవడంతో బలహీనపడింది. సిపిఎం మాత్రం ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా పనిచేసింది. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌కు పెద్ద చెంచాగా మారింది. పార్టీల వల్ల ప్రజలకు ఒనగూడిందేమీ లేదు. దీనివల్ల ఈసారి డాక్టర్లు, ఇంజనీర్లు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వచ్చి ఎన్నికల్లో పోటీ చేయాలి. ప్రజలు ఏదో ఒక ప్రలోభానికి లొంగకుండా సమర్థులకు ఓటు చేస్తే ఫలితముంటుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

కులసంఘాల ధోరణి మారాలి!

ఇటీవల కులసంఘాల ధోరణి వింతగా కన్పిస్తున్నది. అవినీతిపరులు, అక్రమార్కులైన ప్రభుత్వ వుద్యోగులను అవినీతి నిరోధక శాఖాధికారులు పట్టుకొని వారి అక్రమార్జనలు వెలికి తీస్తుంటే కులసంఘాలు మా కులంవాడు కాబట్టి దాడులు చేశారంటూ ఎసిబిపై విరుచుకపడుతున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే ఉద్యోగులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా శిక్షార్హులే. అవినీతి జాడ్యాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలిస్తేగాని సామాన్య మానవుడికి న్యాయం జరగదు. ఈ విషయాన్ని ఆలోచించడం మాని, కులసంఘాలు అవినీతిపరులను వెనకేసుక రావడం ఏమిటి?

ఎం.శ్రీనివాసరావు, నెల్లూరు

సిమెంటు రోడ్డు కబ్జా!

నెల్లూరు కపాడిపాలెం మాజీ కౌన్సిలర్ నవకోటి నరసారావు ఇంటి ఎదురుగా 1990 సంవత్సరంలో ఆయన పర్యవేక్షణలో మునిసిపాలిటీ సిమెంటు రోడ్డు వేసింది. 1995లో ఓ మహిళ ఈ రోడ్డులో మూడు అంకణాల స్థలం ఆక్రమించుకొని రేకుల షెడ్డు వేసుకొంది. ఈ విషయాన్ని 2008లో అప్పటి కమిషనర్ కరుణ చంద్రబాబు దృష్టికి తీసుకవెళ్లగా తొలగింపుకు సిబ్బందిని పంపారు. కాని ఆ ప్రాంతంలోని గూండా అడ్డుపడడంతో వెళ్లిపోయారు. పబ్లిక్

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

25-5-1940
పేజీలు : 10 వెల: అణా

గాలివాన

ఈ నెల 19, 20 తేదీలలోని గాలివాన మదరాసు రాజధాని అంతటా వున్నదని చెప్పవచ్చు. కొన్ని ప్రదేశాలలో లాభకరముగానున్నది. ఎక్కువ ప్రదేశాలలో నష్టకరము.

సోమరాజుపల్లె, మడమనూరు, పడుగుపాడు గ్రామాలలో గాలివాన వలన 650 పశువులు చనిపోయినవి. కనిగిరి, ములుమూడి, కొమ్మరపూడి, నెల్లూరు చెరువులు నిండినవి. మామిడి, అరటి, తమల పాకు తోటలకు చాలా నష్టము కలిగినది. పెంచలుకోనలో ఒక బిడ్డ చనిపోయినది. భీమవరంలో రైతులు ధాన్యపు కుప్పల నుండి పొదుపు చేసుకుండే సమయంలో గాలివాన వచ్చింది. వారి పాలిటకిది యమదూత.

గుంటూరు, కాకినాడ, తాడిపర్తి, నర్సాపురం, కొవ్వూరులలో నష్టమేమీ లేదు. ప్రొద్దుటూరులో గాలివాన వలన జింకు రేకుల పైకప్పులు, కొట్టము మీది బోధ లేచిపోయి కొంత నష్టము కలిగినది.

నెల్లూరులో తొమ్మిది పదునుల వర్షం. మద్రాసులో 4.68 అంగుళాలు, తిరుపతిలో రెండు అంగుళాల 15 సెంట్లు, బళ్లారిలో అంగుళం 39 సెంట్లు, తాడేపల్లిగూడెంలో రెండు అంగుళాలు, జమ్మలమడుగులో ఆరు పదున్న వర్షం కురిసింది. బళ్లారిలో సంవత్సరమంతా కురిస్తే 23 అంగుళాల వర్షం కురుస్తుంది. అందువల్ల ఈ వర్షం జిల్లాకు అపురూపమైంది.

దొనకొండ నుండి బయలుదేరిన గూడ్సు మార్కాపురం, తర్లపాడు మధ్యనున్న వంతెన కూలుట వలన ప్రమాదమునకు లోనైనది. నైజాం రైల్వేలో గూడా ఆవేర్, వంగపల్లి స్టేషన్‌ల మధ్య రైలు మార్గం తెగి బండ్లు సరిగా నడుచుట లేదు.

పెన్నా పడవ ప్రమాదం

ఈ దినం ఉదయం తొమ్మిది గంటలకు పెన్నానదిలో కోవూరు నుంచి నెల్లూరుకు వస్తుండిన పడవ ఓవర్‌లోడ్ వలన నడియేటిలో మునిగింది.

50 ఏళ్ల క్రితం ఈవారం

20-5-1960
పేజీలు: 12 వెల: 0-20 న.పై

పారిస్‌లో కథ అడ్డం తిరిగింది

ఎంతో ప్రచారంతో, ఎన్నో ఆశలతో, ఎంతో కాలానికి 16వ తేది పారిస్‌లో ప్రారంభమైన శిఖరాగ్ర సమావేశం (అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్సు దేశాధిపతుల సమావేశం) ఒక్కసారి పాతాళానికి పడిపోయింది. రష్యా మీద ఎగిరిన అమెరికా గూఢచారి విమానోదంతం మీద శిఖరాగ్ర సమావేశంలో కృశ్చేవ్ జేసిన ఉపన్యాసంతో ఈ సమావేశానికి పురిటిలోనే సంధి కొట్టింది. తన దేశంలో పర్యటనకు అమెరికా అధ్యక్షునికిచ్చిన ఆహ్వానాన్ని కూడా ఉపసంహరించానన్నాడు కృశ్చేవ్. ఈ తాటాకు చప్పుళ్లకు అమెరికా కుందేళ్లు బెదరవన్నాడు ఐసెన్ హోవర్. పరస్పర అవిశ్వాసాలతో రష్యా – అమెరికాలు చేసే ఏ కృషి అయినా యిట్లనే వుంటుంది. బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ కృషి ఫలించకుంటే ప్రపంచ శాంతికి కొత్త ఉపద్రవం తప్పకపోవచ్చు.

ఖాళీ అయిన కౌన్సిల్ స్థానాలు

ఆంధ్ర శాసనమండలిలో జూన్‌కు 30 స్థానాలు ఖాళీ అవుతవి. ఇందులో ఎన్నిక ద్వారా భర్తీ చేయబడవలసినవి 26, నామినేషను ద్వారా పూరింపబడేవి నాలుగు.

ఎన్నికలు జరుగవలసిన వాటిలో తెలంగాణా పట్టభద్రులు ముగ్గురు, తెలంగాణా ఉపాధ్యాయులు ఇద్దరు, కేంద్ర సర్కార్ల స్థానిక సంస్థలు నాలుగు, రాయలసీమ స్థానిక సంస్థలు ఆరు, శాసనసభ ఎన్నుకోవలసినవి 11 స్థానాలు.

పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్ల ఆఖరు తేది మే 24; పోలింగ్ జూన్ 19. శాసనసభ స్థానాలకు నామినేషన్ల చివరి గడువు జూన్ 11, పోలింగ్ జూన్ 24.

నెల్లూరు ముచ్చట్లు

తుఫాన్ తెచ్చిన వర్షం

ఎండలకు అల్లాడిపోతుండిన జిల్లా ప్రజలకు బంగాళాఖాతంలో ఏర్పడిన 'లైలా' తుఫాన్ మూలంగా 18వ తేది సాయంత్రం నుంచి వాతావరణం మారి పోయింది. 19వ తేది ఉదయం ఎనిమిది గంటల నుండి గాలితోపాటు మంచి వర్షపు జల్లు కురిసింది. జనం ఈ వర్షా నికి పులకించి పోయారు.

తుఫాన్ తీవ్రత జిల్లా మీద ఎక్కు వగా వుంటుందన్న సమాచారం మేరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ రామ్‌గోపాల్, ఎస్పీ దామోదర్ తీరప్రాంత ఎమ్మార్వోలతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎటు వంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నామని ప్రకటించారు. తుఫాను మూలంగా 21వ తేది వరకు జిల్లాలో వర్షాలు పడుతాయని వాతా వరణ శాఖ జిల్లా కలెక్టర్‌కు పంపిన వాతావరణ సందేశంలో పేర్కొంది. అర క్కోణం నుంచి జాతీయ విపత్తుల నివా రణ సంస్థకు చెందిన నిపుణుల బృందం కూడా 19వ తేది నెల్లూరు చేరుకొంది. వీరి నేతృత్వంలో తుఫాను తీవ్రత ఆధా రంగా సురక్షిత చర్యలకు జిల్లా యం త్రాంగం తగు చర్యలు తీసుకొంటుంది. 20వ తేది మంత్రి రామనారాయణరెడ్డి, తుఫాన్ ప్రత్యేకాధికారి, పాత కలెక్టర్ జి.అనంతరాము పునరావాస చర్యలపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరి పారు.

జనాన్ని హింసించిన లైలా!

19వ తేది బంగాళాఖాతంలో ఏర్ప డిన 'లైలా' తుఫాన్ మూలంగా వీచిన గాలులకు నెల్లూరు నగరంలో రోడ్లపై చెట్లు విరుచుకపడ్డాయి. కొన్ని చోట్ల కరెంటు తీగలపై ఈ చెట్లు పడ్డాయన్న సాకుతో విద్యుత్ శాఖాధికారులు 24 గంటలపాటు నగరంలో విద్యుత్ సర ఫరా ఆపేశారు. దీంతో మంచినీటి సౌక ర్యం లేక ఓ రాత్రంతా జనం చీకటిలో మగ్గిపోయారు. నిరంతరం చెట్లు కొడు తున్నామని చెప్పే విద్యుత్ శాఖాధికా రులు చిన్న గాలివానకే విద్యుత్ సరఫరా నిలిపి వేయడం విమర్శలకు తావిచ్చింది.

పొర్లుకట్ట ప్రాంతంలో బొప్పాయి చెట్టు మీద పడి రెండేళ్ల పసి బాలుడు షారూఖ్ హుస్సేన్ మరణించడం మినహా నగరంలో మిగతావన్నీ స్వల్ప సంఘటనలనే చెప్పాలి.

కర్ణాటక రెవిన్యూ మంత్రి!

కర్ణాటక రెవిన్యూ మంత్రి గాలి కరుణాకర్ రెడ్డి 14వ తేది జిల్లా సరి హద్దుల్లోని రామదూత స్వామి ఆశ్రమా నికి వచ్చారు. కరణాకర్‌రెడ్డి స్వస్థలం శ్రీకాళహస్తి. జిల్లా ఎస్పీ దామోదర్ చిన్న నాటి మిత్రుడు కావడంతో కరుణాకర్ రెడ్డి బంగళాకు వెళ్లి ఆయన క్షేమ సమా చారాలు అడిగి తెలుసుకొన్నారు. కాసేపు పాత సంగతులను మనసువిప్పి మాట్లా డుకొన్నారు. ఆ తర్వాత కారులో ఆయన బెంగుళూరు బయలుదేరి వెళ్లారు.

దేవుడు లేడంటున్న రామదూతస్వామి!

నెల్లూరు – ప్రకాశం జిల్లాల సరి హద్దుల్లోని చేవూరులో ఆశ్రమం నిర్వహి స్తున్న రామదూతస్వామి వద్దకు ఇటీవల కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప, రెవిన్యూమంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి, కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి ముని యప్పన్ తోపాటు రాష్ట్ర డిజిపి గిరీష్ కుమార్ సందర్శిం చడంతో స్వామికి ఎక్కడలేని క్రేజ్ వచ్చింది. విచిత్రమే మిటంటే ఈ స్వామి తన బోధనల్లో దేవుడు లేడంటు న్నాడు. మనిషే దేముడంటున్నాడు. దేవుడుంటే తిరుపతి వెళ్లి వచ్చే భక్తులు రోడ్డు ప్రమాదాలకు ఎందుకు లోనవుతా రని ప్రశ్నిస్తున్నారు. పురాణకాలం నుంచి నేటివరకు సమాజంలో సకల అరిష్టా లకు పురుషులే కారణమంటున్నాడు. త్రేతాయుగంలో లంకలో జరిగిన రామ – రావణ యుద్ధంలో పురుషులందరినీ శ్రీరాముడు చంపేయడం వల్ల అక్కడి స్త్రీలు పెట్టిన శాపాలు నేటికీ వెన్నాడు తున్నాయన్నారు. శ్రీరామదూత పేరు పెట్టుకొని స్వామి రాముడ్ని – దేవుడ్ని నిందించడం విచిత్రమనిపిస్తుంది. కానీ ఈ స్వామి దర్శనానికి విఐపి భక్తులు బారులు తీరడం ఇంకా విచిత్రమనే చెప్పుకోవాలి. కలికాలం ఏం చేస్తాం?

తెలుగు తీర్థం స్వీకరించిన మనపార్టీ నేతలు!

మన పార్టీ వ్యవస్థాపక నేత కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ మారడంతో జిల్లాలోని ఆ పార్టీ నేతలకు మరో దిక్కు లేకుండా పోయింది. దీంతో ఆ పార్టీ నేతలు బాలకోటేశ్వరరావు, సురేంద్ర బాబు, బి.వి.లక్ష్మి తదితరులు 600 మంది కార్యకర్తలతో కలసి 16వ తేది తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వీరిని సగౌరవంగా ఆహ్వానించి పసుపు కండువాలు కప్పారు.

నెల్లూరులో దినేష్‌రెడ్డి!

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్ దినేష్‌రెడ్డి ఇటీవల నెల్లూరుకు వచ్చారు. జిల్లాలో తమ శాఖ లక్ష్యానికి మించి బాగా పనిచేసినట్లు చెప్పుకొ చ్చారు. 72 ప్రభుత్వ శాఖలపై నిఘా ఉంచి ఉన్నట్లు చెప్పారు. కాని పెన్నా నదిలోని రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణాను తమ శాఖ ఆపలేకపోతున్న విషయాన్ని దినేష్‌రెడ్డి మరచినట్లున్నారు.

ప్రజోపయోగ పనులు చేయండి!

నెల్లూరు నగరంలో అక్రమ కట్ట డాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా వచ్చిన దాదాపు పది కోట్ల రూపా యలతో తాగునీరు, డ్రైనేజి, ఖాళీస్థ లాలు, స్మశానాల సంరక్షణ. కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ పనులు చేపట్టను కార్పొరేటర్ల ద్వారా ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. కార్పొ

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు. గ్రాముకు రూ.50/- తగ్గింపు. డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్, ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్ : 2331133, 2327611

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furniture"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్, రామ్మూవీస్ కాంప్లెక్స్ రోడ్, నెల్లూరు.సెల్: 9246435616, 9849495615

కృతజ్ఞతాభివందనములు

నిర్మాణ రంగంలో 21 సం॥ల విశేష అనుభవంతో అపార్ట్‌మెంట్స్, కళ్యాణ మండపాలను, భవంతులను అందంగా, అత్యాధునికంగా, రూపొందిస్తూ... అందరి మన్ననలు అందుకుంటూ... విజయపథంలో పురోగమిస్తున్న మా తపస్వి కన్‌స్ట్రక్షన్స్ వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్ దేవుళ్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.
Er. S. Gangadharam
Cell : 9849078489
Thapaswi CONSTRUCTIONS
Building Planners & Designers
Licenced Building Surveyors, Interior Designers
Pavani Homes, Near Magunta Under Bridge, Nellore. Ph: 2334105

శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి వారి దేవస్థానం
పెంచలకోనక్షేత్రం, రాపూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా. ఫోన్ : 08621 - 221604
బ్రహ్మోత్సవ కార్యక్రమములు


తేది 25-05-2010 రాత్రి 11-00 గంటలకు - బంగారు హనుమంత సేవ
తేది 26-05-2010 రాత్రి 11-00 గంటలకు - బంగారు గరుడ సేవ
తేది 27-05-2010 ఉదయం 10-30 గంటలకు - శ్రీవారి తిరు కళ్యాణము
సాయంత్రం 6-00 గంటలకు - రథోత్సవము (తిరుత్తేరు)
తేది 28-05-2010 రాత్రి 7-00 గంటలకు - తెప్పోత్సవము
భక్తులందరికీ సాదర ఆహ్వానం!
భక్తులు శ్రీస్వామివారిని దర్శించి తరించ ప్రార్థన.
శనగవరం శ్రీరామమూర్తి
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి (FAC)

మాజీ ఎఎస్పీకి మోజు తీరలేదు!

నెల్లూరు ఎఎస్పీగా నాలుగేళ్లు పనిచేసిన కనకారావుకు ఇంకా ఆ పదవిపై మోజు తీరినట్లులేదు. ఆయన అధికారిక క్వార్టర్‌ను ఖాళీ చేయలేదు. ఎఎస్పీగా కనకారావు వాడుతుండిన కారు తిరిగి ఇవ్వలేదు. ఎఎస్పీగా వున్నప్పుడు ఆయన ఇంటిలో పనిచేస్తుండిన యావత్తు పోలీసు సిబ్బంది ఇంకా ఆయన వద్ద పనిచేస్తుండడం కాస్త ఆశ్చర్యపరుస్తుంది. ఎఎస్పీగా పనిచేస్తుండిన కనకారావు ఆయన పదవీ విరమణ చేసే ముందు రోజు ఎస్పీగా ప్రమోషన్ వచ్చింది. నామ్‌కే వాస్తేగా ఈ బాధ్యతలు స్వీకరించాక అధికారికంగా పదవీ విరమణ చేశారు. ఇది గడచి రెండు నెలలకు పైపడింది. కానీ శబరి శ్రీరామ క్షేత్రం ప్రాంతంలో వుండే ఎఎస్పీ క్వార్టర్‌ను ఆయన ఖాళీ



ఎఎస్పీ క్వార్టర్‌పై ఇంకా వున్న కనకారావు పేరు.

చేయలేదు. ఇంకా ఆయన నేమ్ బోర్డు ఎఎస్పీ బంగళాపై వుంది. ఎఎస్పీగా ఆయన వాడుతుండిన వాహనం, ఏడు మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు హోమ్‌గార్డులు ఈ మాజీ ఎఎస్పీ ఇంట్లో వంటావార్పు చేస్తూనే వున్నారు.

ఇటీవల నలుగురు పోలీసులు పోలీసు అధికారుల సంఘంలో పనిచేస్తూ విధులకు సరిగ్గా హాజరు కావడంలేదంటూ ఎస్పీ దామోదర్ వారికి మెమోలు జారీ చేశారు. మరి ఏడు మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు హోమ్‌గార్డులు పదవీ విరమణ చేసిన ఎఎస్పీ కోసం ఇంకా కేటాయించి వుంచడం కాస్త ఆశ్చర్య పరుస్తుంది. జిల్లాలో వున్న పోలీసు సిబ్బందిలో 300 మందికి పైగా కానిస్టేబుళ్లు ఆర్డర్లీలుగా పలువురు పోలీసు అధికారుల ఇళ్లలో పనిచేస్తున్నారు. ఈ వ్యవస్థను రద్దుచేసి ఏళ్లు గడుస్తున్నా ఇంకా జిల్లాలో జవసత్వాలు కల్గి వుండడం ఆక్షేపణీయం కాదా?

ముదనష్టంగా మూలాపేట రోడ్డు!

నెల్లూరు నగరంలోని అతి ముఖ్య ప్రాంతమైన మూలపేటకు వెళ్లే రోడ్డు దుస్థితిలో వుంది. ఏళ్ల తరబడి ఈ రోడ్డు దెబ్బతిని వున్నా ఈ ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన నగరాధ్యక్షుడు చాట్ల నరసింహారావు కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మూలపేటకు మొగదాల ఉమామహేశ్వరాలయం, సిఎంఎం స్కూల్ నుంచి పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు రోడ్డు గుంటామిట్టలతో దెబ్బతినిపోయి వుంది. వేదసంస్కృత



దెబ్బతినిపోయిన రోడ్డు

కళాశాల, పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి చేపల మార్కెట్ వరకు ఇదే పరిస్థితి నెలకొని వుంది. ఈ ప్రాంతంలోనే వేణుగోపాలస్వామి, మూలాస్థానేశ్వరాలయం, నెల్లూరు నగర దేవత ఇరుగాళమ్మ ఆలయాలున్నాయి. ఈ దేవాలయాలకు వెళ్లే భక్తులు, ద్విచక్ర వాహనదారులు సైతం గుంటామిట్టలతో వున్న ఈ రోడ్డున పోలేక నానాపాట్లు పడుతున్నారు. ఈ రోడ్డు వేయను టెండరు పాడుకొన్న కాంట్రాక్టర్ కడప జిల్లావాసి కావడంతో అతని జోలికి వెళ్లను నాయకులు, అధికారులు సాహసించలేక జనాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సోమవారం ఖచ్చితంగా మూలస్థానేశ్వరుని సందర్శిస్తారు. వారంలోని మిగతా రోజుల్లో నగరాధ్యక్షుని స్కూల్‌లో రాజకీయ మంతనాలకు మేయర్‌తో కలసి వెళ్తుంటారు. ఆ సమయంలోనైనా దెబ్బతినిపోయిన రోడ్డు ఈ నేతలకు కనపడకపోవడం బాధాకరం.

వివాదాస్పదమైన కమ్మ సంఘం ఎన్నికలు!

జిల్లాలో పేరుప్రఖ్యాతులున్న కమ్మ జన సంక్షేమ సమితికి 16వ తేది జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలు వివాదాస్పదమయ్యాయి. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మాదూరు నరసింహులు నాయుడు ఒక వర్గానికి కొమ్ము కాసారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కమ్మ జన సంక్షేమ సమితిలో 800 మంది సభ్యులున్నారు. వీరిలో వెంకయ్యనాయుడు, బొల్లినేని కృష్ణయ్య, కె.వి.రత్నం, గంగాప్రసాద్ వంటి ప్రముఖులున్నారు. ఈ సమితికి మైపాడు రోడ్డులోని శ్రీరాంనగర్‌లో మంచి భవనం, 80 లక్షల రూపాయల నిల్వ నిధులున్నాయి. ఈ సంఘంలో ఉదయగిరి ప్రాంతీయుల ఆధిపత్యం పెరిగిపోయింది. పెత్తనం కోసం ఆ ప్రాంతీయులు చేపట్టిన సభ్యత్వా



నెల్లూరులోని కమ్మ జన సంక్షేమ సమితి కార్యాలయం.

లకు అనుగుణంగా ఎన్నికల అధికారి ఎన్నికలు నిర్వహించడం, లేని ప్రధాన కార్యదర్శి పోస్టు సృష్టించడం, బైలాలో పేర్కొన్నట్లుగా కోశాధికారి పదవి ఎన్నిక జరపకపోవడం ఏకపక్షంగా అంతా జరిగిందని ప్రకటించడం ఈ సంఘంలో సభ్యులైన ప్రముఖులకు ఆవేదన కల్గించింది. ఎన్నికల అధికారి తన బాధ్యతలకు భిన్నంగా రాజకీయ నాయకుని అవతారమెత్తి నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నిక నిర్వహించిన తీరుపై కొందరు సభ్యులు న్యాయస్థానానికి వెళ్లను రంగం సిద్ధం చేసుకొన్నట్లు తెలిసింది. సంఘ ఎన్నికల బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారని మాజీ న్యాయమూర్తికి అప్పగిస్తే ఆయన అన్యాయంగా వ్యవహరించడంతో సభ్యులు కారాలు మిరియాలు నూరుతున్నారు. మొత్తం మీద జిల్లాలోని అతిపెద్ద కుల సంఘం కార్యవర్గ ఎన్నిక వివాదాస్పదం కావడం తదనంతరం పరిణామాలు ఎంత దూరం వెళ్తాయన్నది మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

బేల్దారుకు దిన కూలీ రూ.400!



బేల్దారు పనిచేస్తున్న కార్మికుడు.

బతకలేని వాడు బడిపంతులు... బేల్దారు పని చేస్తూ బతకడం కష్టమనే సామెతలు సామెతలుగానే మిగిలిపోయాయన వచ్చు. రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ పనుల్లో కాస్త స్తబ్దత ఆవరించి వున్నా నెల్లూరులో మాత్రం ఈ పనులు జరుగుతూనే వున్నాయి. పైపెచ్చు బేల్దారు పనులు చేసే వారికి మంచి డిమాండ్ వుంది. దీంతో బేల్దారు పని చేసే వారికి రోజు కూలీగా 400 రూపాయలిస్తున్నారు. నెలలో పని లేని రోజుండదు. దీన్ని బట్టి నెలసరి బేల్దారు పనికి వెళ్లే వారు ప్రభుత్వ ఉద్యోగస్తుడి మాదిరి 12వేల రూపాయలు సంపాదిస్తున్నాడు. బేల్దారు పనుల్లో సహకరించే మగకూలీకి రోజుకు 300 రూపాయలు, ఆడ కూలీకి 250 రూపాయలిస్తున్నారు. బిల్డింగులు పగుల గొట్టే పనుల్లో వుండే వారికి దినకూలీ 350 రూపాయలు. 9.30 గంటలకు పని ప్రారంభిస్తే మధ్య టీ బ్రేక్, మధ్యాహ్నం ఒంటి గంటకు పని ఆపేస్తారు. భోజనం చేసాక 2.30 గంటలకు పని మొదలుపెట్టి 5.30 గంటలకు చేతులు కాళ్లు కడుక్కొని వెళ్లి పోతున్నారు. చురుకుగా బేల్దారులు పనిచేయక పోవడం వల్ల ఇళ్లు కట్టుకొనేవాళ్లు కూలీలకే లక్షలు వెచ్చించాల్సి వస్తుంది. నిర్మాణ కూలీల్లో రాక్ బిల్డింగ్ పనులు చేసే వారికి రోజు కూలీగా 500 రూపాయలిస్తున్నారు. సొంబేరితనం లేనివారు దిన కూలీగా వెళ్లినా నెలసరి నిలబెట్టి తొమ్మిది వేలు సంపాదించే రోజులివి.

ఊపు తగ్గిన అక్షయ త్రితియ

వసిడి పండుగగా పిలువబడే అక్షయ త్రితియ పండుగను గత కొన్నేళ్లుగా నెల్లూరు నగరంలోనూ జరుపుకొంటున్న సంగతి తెలిసిందే. ఆనాడు బంగారం కొన్నట్లయితే లక్ష్మీ కటాక్షం కల్గుతుందని పలువురి నమ్మకం. తమ శక్తిని బట్టి బంగారు ఆభరణాలు కొని త్రితియ నాడు ఇంటికి తీసుకొని పోతుంటారు ప్రజలు. ఈ పండుగ జరుపుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా అలవాటైంది. ఉత్తరాదికి చెందిన బంగారు వ్యాపారులు దీనిని నగరంలో వ్యాప్తిచేసినా అందులోనూ వారి స్వార్థం దాగి వుందనేది పలువురి నుంచి విన్పిస్తున్న విమర్శ. రకరకాల స్కీముల పేరుతో తమ వ్యాపార అభివృద్ధికి యత్నించిన ప్పటికీ వినియోగదారులు పెద్దగా స్పందన చూప

గతంలోలా లేని వ్యాపారాలు!

ఏడాది మాత్రం ఈ పండుగ సందర్భంగా బంగారంగళ్లు వెలవెలపోయాయి. పసిడి ధరలు ఆకాశానికి అంటడం, ఆర్థిక మాంద్య ప్రభావం ఈ పండుగపై పడింది. దీనికితోడు వ్యాపారులు ప్రజల నమ్మకాన్ని ఆసరా చేసుకొని తమ వ్యాపారాన్ని పెంచుకొనేందుకు ప్రయత్నించడం మరో కారణం.

జిల్లావాసులకు ఈ అక్షయ త్రితియ లేదనే చెప్పాలి. బంగారం రేటు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగి పోవడంతో బంగారంగళ్ల గడప తొక్కను మహిళలు వెనకడుగు వేశారు. ఎంత ప్రచారార్భాటం, ఎన్ని స్కీములు, ఎన్ని ఆఫర్లు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఏదిఏమైనా గత కొన్నేళ్లుగా త్రితియ సందర్భంగా కిటకిటలాడిన బంగారంగళ్లు ఈసారి మాత్రం వెలవెలపోయాయి.

ఉపాధిహామీ పనుల్లో ఆగని అవినీతి!

జిల్లాలో గత ఐదేళ్లుగా అమలవుతున్న ఈ పథకంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై గతంలో ఎసిబి విచారించింది. కాని చర్యలు లేవు. ప్రస్తుతం ఈ బాధ్యతలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టారు.



ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు. (ఫైల్‌ఫోటో)

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు జరగాల్సిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం పలు దఫాలుగా మార్గదర్శకాలు, కఠిన నిబంధనలు జారీచేసినా ఏదోఒక విధంగా ఈ పథకానికి తూట్లు పడుతూనే వున్నాయి. ఈ పథకంలో నియమింప బడిన సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం కూడా అవకతవకలకు మరో కారణంగా చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో చోటా రాజకీయ నేతలు, సర్పంచ్‌లు రంగప్రవేశం చేసి సిబ్బందిని మభ్యపెట్టి అక్రమాలకు పాల్పడే విధంగా చేస్తున్నారు.

లక్ష్యం నెరవేరలేదు

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సంవత్సరానికి వందరోజులు పని దినాలు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. 2005 సంవత్సరంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 2006వ సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. కేంద్రప్రభుత్వం 75శాతం, రాష్ట్రప్రభుత్వం 25 శాతం నిధులు భరించే విధంగా ఈ పథకానికి రూపకల్పన జరిగింది. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరకుండా పోవడమే కాకుండా, అధికారపక్షానికి చెందిన నేతలకు ఇది కల్పతరువుగా మారింది.

రికవరీ చేస్తాం!



ఉపాధిహామీ పథకం నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బంది నుంచి నిధులు రికవరీ చేస్తున్నాం. ఇప్పటికే కొంతమంది నుంచి రికవరీ చేసి విధుల నుంచి తొలగించడం జరిగింది. మిగిలిన వారిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఈ పథకం మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నాను.

బి.రామిరెడ్డి, డ్వామా పిడి

యంత్రాలతో పనులు

జిల్లాలోని 46 మండలాల్లోని 961 గ్రామ పంచాయితీలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలవుతుంది. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ భూముల అభివృద్ధి, నీటిపారుదల కాల్వల మరమ్మత్తులు, కాల్వగట్ల నిర్మాణం, గ్రావెల్‌రోడ్లు, ఇందిరమ్మ చెరువుల మరమ్మత్తులు తదితర పనులు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులను యంత్రాల ద్వారా కాకుండా కూలీల ద్వారానే చేయించాల్సి వుంటుంది. అయితే స్థానిక రాజకీయ నేతలు అధికారుల్ని ప్రలోభపెట్టి యంత్రాల ద్వారా పనులు చేయిస్తున్నారు. దీనిని ప్రశ్నించేవారు లేకపోవడం వలన నిధుల దుర్వినియోగం ఇష్టానుసారంగా జరిగిపోతుంది.

కోట్ల రూపాయలు దుర్వినియోగం

గత ఐదు సంవత్సరాల నుంచి అమలవుతున్న ఈ పథకంలో కోట్లరూపాయల నిధులు చేతులు మారాయి. ఆరోపణలు వచ్చిన మండలాల్లో దుర్వినియోగం జరిగిన నిధుల్ని తిరిగి రాబట్టడంలో అధికారులు ఉదాసీనత వైఖరి ప్రదర్శించారు. ఈ పథకం ప్రారంభించే నాటికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా సుబ్బరాజు బాధ్యతలు నిర్వహించేవారు. సుబ్బరాజు హయాంలో అవకతవకలకు ఆస్కారం లేకపోవడంతో రాజకీయ, అధికార బలం వుపయోగించి దీర్ఘ కాలిక సెలవుపై వెళ్లే విధంగా చేయగలిగారు మన రాజకీయ నేతలు.

దీంతో ఆయన స్థానంలో అప్పట్లో ఐటిడిఏ పి.ఓగా వున్న రామచంద్రను డ్వామా పి.డిగా ప్రభుత్వం నియమించింది. ఈయన ఐటిడిఏ పి.ఓకు ముందు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్‌గా ఈ జిల్లాలో పనిచేశారు. ఈయనపై అనేక ఆరోపణలు వున్నప్పటికి జిల్లా నుంచి బదలీ చేయకుండానే ఇక్కడ రెండుశాఖలకు అధిపతిగా నియమించడం జరిగింది. రామచంద్ర డ్వామా పిడిగా వున్న సమయంలో ఉపాధిహామీ పథకంలో అధికభాగం నిధులు దుర్వినియోగమయ్యాయి. నిధులు స్వాహా చేసిన వారి నుంచి రికవరీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన ఈ అధికారి చివరకు ఏం చేయలేక చేతులెత్తేశారు.

సూత్రధారులపై చర్యలు లేవు

పూర్తిగా నిర్వీర్యమైన ఈ పథకం తిరిగి గాడిలో పడలేకపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక తనిఖీల పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అవకతవకలు బహిర్గతం అయినా కూడా క్రిందిస్థాయి సిబ్బందిని మాత్రమే తొలగించారే తప్ప అసలు సూత్రధారులపై ఇప్పటి వరకు చర్యలు లేవు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ఈ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీరాజ్ ఇంజనీర్లు మొత్తం అవినీతి, అక్రమాలకు పాల్పడుతూనే వున్నారు. గ్రామాలలో నివాసం లేని వారి పేర్లతో జాబ్‌కార్డులు జారీ చేయడం, మరణించిన వారి పేర్లను నమోదు చేసి పనులు చేసినట్లు కూలీ డబ్బులు చెల్లించడం వంటి పనులు చేస్తున్నారు.

ఇటువంటి అక్రమాలలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ పథకం అమలుపై తీవ్రమైన ఆరోపణలు, ఫిర్యాదులు అందడంతో రామచంద్రను బదలీ చేసి అటవీశాఖలో పని చేస్తున్న సుధాకర్ రెడ్డిని డ్వామా పి.డి.గా ప్రభుత్వం నియమించింది. ఈయన బాధ్యతలు చేపట్టిన ఆరు నెలలకే జిల్లాపై పూర్తి అవగాహన చేసుకున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు చేసిన ప్రయత్నాలకు మన రాజకీయ నేతలు అడుగడుగునా మోకాలడ్డుతూనే వచ్చారు. ఏ అధికారి పర్యటించని విధంగా ప్రతి మండలంలో పర్యటించి అక్రమాలకు పాల్పడిన సిబ్బందికి తనదైన శైలిలో ఘాటుగా హెచ్చరికలు కూడా చేశారు.

జిల్లాస్థాయిలో ఒత్తిళ్లు రావడంతో రాష్ట్రప్రభుత్వానికి కూడా పథకంలో చోటు చేసుకున్న లోటుపాట్లపై నివేదించారు. అయినా కూడా ప్రభుత్వం స్పందించలేదు. సుధాకర్‌రెడ్డి పిడిగా వున్నంత కాలం రాజకీయ నేతలను దగ్గరకు చేరనిచ్చేవాడు కాదు. ఇటువంటి సమయంలో తమ ఆటలు సాగవని గ్రహించిన నేతలు జిల్లా నుంచి బదలీ చేయించేందుకు వెనుకాడలేదు. బదలీపై వెళ్లే సమయంలో కూడా రాజకీయనేతల్ని వుద్దేశించి ఆయన ఘాటుగా విమర్శలు చేశారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరిస్తే ఎవరికి భయపడాల్సిన అవసరం వుండదని, రాజకీయ నేతలు ఐదు సంవత్సరాలు పదవిలో వుంటే ఉద్యోగులు 30సంవత్సరాలకు పైగా సర్వీసులో వుంటారని వ్యాఖ్యానించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

గతంలోనే ఈ పథకం కోసం ఖర్చు చేసిన నిధులపై అవినీతి నిరోధకశాఖ అధికారులు ఒకసారి విచారణ చేపట్టారు. ఆ తర్వాత ఆ శాఖ వున్నతాధికారుల నుంచో, రాజకీయ నేతలవైపు నుంచో ఒత్తిళ్లు ఏమైనా వచ్చాయో తెలియదుగాని మొత్తం మీద విచారణ మధ్యలోనే నిలిచిపోయింది. ఈ దఫా జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు ఈ పథకం అమలు తీరుపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. జిల్లాలోని గూడూరు, కావలి, నెల్లూరు రెవెన్యూ డివిజన్లలోని పలు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీలలో అక్రమాలు వెలుగు

కొరవ 14వ పేజీలో





ఎస్పీ దామోదర్‌ను బంగ్లాలో కలసిన ఆయన చిన్ననాటి మిత్రుడు కర్నాటక రెవిన్యూమంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి.



ప్రజాపథం ముగింపు సందర్భంగా నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.



నెల్లూరు టౌన్‌హాల్‌లో సింహపురి సంస్కృతి సమాఖ్య నేతృత్వంలో జరిగిన తరిగొండ వెంగమాంబ పద్యనాటకంలో ప్రధాన పాత్రధారిణి సురభి జమునా రాయలును సత్కరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి.



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పార్శిల్ సూపర్‌వైజర్ ముక్కర హరిబాబుకు రాష్ట్ర ప్రభుత్వ "శ్రమశక్తి" అవార్డును అందజేస్తున్న కార్మిక మంత్రి రామిరెడ్డి వెంకటరెడ్డి. ప్రక్కన ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య.

● ప్రసన్న

కాంగ్రెస్ భజన!

కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆ పార్టీ పుట్టినిల్లులాంటిదని అభివర్ణించారు. ప్రజాపథం కార్యక్రమంలో భాగంగా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామానికి వచ్చిన ప్రసన్న కాంగ్రెస్ భజన చేశారు. 2004, తిరిగి 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ తిరుగులేని అధిక్యంతో గెలవడానికి ప్రధాన కారణం సంక్షేమ పథకాలేనని చెప్పారు. చాలామంది పలు పథకాలు, హామీలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వైపే వున్నారని పరోక్షంగా చంద్రబాబునాయుడును విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపథం ఓ వరం అన్నారు. తన ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్‌ను పొగడ్తలు, తెలుగుదేశంపై వ్యంగ్యాస్త్రాలు విసిరిన ప్రసన్నకుమార్‌రెడ్డి చివరిలో రాజకీయాలు ఎన్నికల వరకేనని, తర్వాత అభివృద్ధి ముఖ్యమని చెప్పడం కొసమెరుపు. కార్యక్రమానికి ముందు ఆయన తన భార్యతో కలసి చాముండేశ్వరిని దర్శించుకొన్నారు.

ప్రజాపథంను ఇలా వాడుకొన్నాడు

డక్కిలి చెరువులకు నీళ్లు!

● ఎమ్మెల్యే కురుగొండ్ల హామీ

డక్కిలి మండలంలో అన్ని చెరువులకు నీటి వసతి కల్పిస్తామని వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. స్థానికంగా జరిగిన భూపంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి ప్రాంతంలో నిర్మాణంలో వున్న ఎస్ఎస్ కెనాల్, తెలుగుగంగ కాలువల ద్వారా చెరువులకు నీటి మళ్లింపునకు అవసరమైన తూములు, స్లూయిజ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నీటి మళ్లింపు సాధ్యం కాని చెరువులకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటి వసతి కల్పిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో వ్యవసాయానికి మంచిరోజులు వస్తున్నాయని, పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ భూములకు ప్రభుత్వమే కరెంటు, నీటి వసతి కల్పిస్తుందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని భూములను అమ్ముకోవద్దని, అలాగే తాకట్టు పెట్టినా అప్పులపాలవుతారని దీనిని దృష్టిలో వుంచుకొని భూమిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదవ విడతగా జరిగిన భూపంపిణీలో డక్కిలి మండలంలోని 145 మందికి 164 ఎకరాలకు పట్టాలు అందించారు.

వెంకటగిరి సొసైటీల తీరు బాగుంది!

● వసతులు సమకూరాయి - వ్యాపారాలు బాగున్నాయి

వెంకటగిరి ప్రాంతంలోని సింగిల్ విండో సొసైటీలకు సొంత భవనాలు ఏర్పడనుండడంతో వ్యాపారం పుంజుకుంటోంది. దశలవారీగా అన్ని సొసైటీలకు భవనాలు ఏర్పాటవుతున్నాయి. నియోజకవర్గంలోని మొత్తం 15 సింగిల్ విండో సొసైటీల్లో ఇప్పటికే ఐదు సొసైటీలకు సొంత భవనాలు ఏర్పడ్డాయి. వెంకటగిరి మండలంలోని యాతలూరు సొసైటీ, డక్కిలి మండలంలో డక్కిలి, లింగసముద్రం, ఆల్తూరుపాడు సొసైటీలు సొంత భవనాలు నిర్మించుకొన్నాయి. బాలాయపల్లి మండలంలో నిడిగల్లు సొసైటీకి భవన వసతి వుంది. క్రొత్తగా మాచవరం సొసైటీకి భవన వసతి లభించనుంది. ఈ సొసైటీలకు భవన వసతి ఏర్పడడంతో ఎరువుల వ్యాపారం పుంజుకుంది. దీంతో పాటు డిపాజిట్ల సేకరణపైనే దృష్టి సారిస్తున్నారు. నిడిగల్లు సొసైటీ టర్నోవర్ 50 లక్షలకు చేరుకొంది. జయంపు, బాలాయపల్లి, భైరవరం సొసైటీలలోనూ వ్యాపారం బాగా జరుగుతోంది. సొంతభవనాల ఏర్పాటుతో వెంకటగిరి నియోజకవర్గంలోని సొసైటీల్లో వసతులు, వ్యాపారాల్లోనూ మార్పులు వచ్చాయి. రైతులకు రుణాలిచ్చే సంఘాలుగా వున్న ఇవి నేడు వ్యాపారపరంగాను ముందంజలో వున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార శాఖ, నాబార్డు ఈ సొసైటీలను ప్రోత్సహిస్తుండడంతో సొంత వ్యాపారాల ద్వారా అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ఉదయగిరి ఉపాధిపనుల్లో అవినీతి!

● దారిమళ్లిన పదికోట్లు

ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకంలో జిల్లాలో పలుచోట్ల అక్రమాలు చోటు చేసుకొన్నాయి. ముఖ్యంగా ఉదయగిరి మండలంలో పెద్దఎత్తున అవినీతి జరిగింది. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 10కోట్ల రూపాయల పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు సమాచారం. ఇందులో నాలుగు కోట్ల రూపాయలు అధికారులు, స్థానిక నేతలు స్వాహా చేశారని వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర విజిలెన్స్‌శాఖ దృష్టి సారించింది. ప్రతిపక్షపార్టీకి చెందిన నేతలు చేసిన ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. తాము చేసిన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకొనేందుకు రికార్డులను సరిదిద్దే క్రమంలో తలమునకలై వున్నారు. ఈ అవినీతి ఆరోపణలపై ఇదివరకే సస్పెండైన ఓ ఉద్యోగి రికార్డులను తారుమారు చేయడంలో సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తే తప్ప అవినీతి పరుల బండారం బట్టబయలు కాదు.

జోరందుకున్న కల్లు వ్యాపారం!

ఎండలు మండుతుండడంతో శీతల పానీయాల అమ్మకాలు పెరిగాయి. దీనికి తగినట్లే కల్లు విక్రయాలు జోరందుకొన్నాయి. ముత్తుకూరు మండలంలో ఎక్కడ చూసినా రోడ్డు ప్రక్కల కుండలతో కల్లు నింపుకొని అమ్మకాలకు సిద్ధంగా వున్న మహిళలే దర్శనమిస్తున్నారు. పలు రకాల మద్యం బ్రాండీ షాపుల్లో దొరుకుతున్నా ప్రకృతి సిద్ధంగా లభించే కల్లు త్రాగేందుకు పలువురు మక్కువ చూపుతుంటారు. ముఖ్యంగా వేసవిలో కల్లు సేవించడం వలన వేసవి తాపం నుంచి బయటపడవచ్చుననేది కల్లు ప్రియుల అభిప్రాయం. కల్లు త్రాగడం వల్ల ఆరోగ్యానికి సంబంధించి లాభనష్టాల సంగతి ఎలా వున్నా ప్రమాదాలు జరుగుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల వెంబడి కన్పించే కల్లు విక్రేతలను చూసి పలువురు వాహనాలను ఆపి దీనిని సేవించి వాహనాలను నడుపుతుండడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



నెల్లూరు కవి కెవి.నాగేశ్వరరావుకు విజయవాడలోని ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ తరఫున శ్రీశ్రీ సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి. ప్రక్కన ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్.

ఆగని నాటుసారా వ్యాపారం

ఇళ్లలోనే కాస్తున్నారు

బోగోలు మండలంలో సారాయి వ్యాపారం చాపక్రింద నీరులా సాగిపోతుంది. గతంలో అటవీ ప్రాంతంలో తయారవుతున్న సారాయి నేడు శివారు ప్రాంతాల్లో జరుగుతోంది. సారాయి తయారీదారులు ఇళ్ల మధ్యనే సారాయిని తయారు చేసి అమ్మకాలు సాగిస్తుండడంతో నిత్యం అక్రమ వ్యాపారులు రాకపోకలు సాగిస్తు వీటి అమ్మకాలు చేస్తున్నారు.

మండలంలో పలుప్రాంతాల్లో అక్రమ సారా తయారీ, వ్యాపారాలు జరుగుతున్న సమాచారం తెలిసినా ఎక్సైజ్ పోలీసులు తమకేమీ తెలియనట్లు వుండడం విమర్శలకు తావిస్తోంది. ఎప్పుడో ఒకసారి వచ్చి హడావిడి చేయడం, మామూళ్లు దండుకొని పోవడం తప్ప కఠిన చర్యలు తీసుకోకపోవడంతో సారాయి వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది.

అలంకార ప్రాయమైన సెంట్రల్ లైటింగ్

వెలిగేదెప్పుడు?

వెంకటగిరి పట్టణంలో మునిసిపాలిటీ ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం అలంకార ప్రాయంగా మారింది. పట్టణంలో వెలుగులు విర జిమ్ముతుందని ఆర్భాటంగా, అట్టహాసంగా ఈ లైట్లను ఏర్పాటు చేశారు. వేసిన కొద్ది కాలానికే ఇవి వెలగకపోవడంతో లైట్లు దిష్టిబొమ్మల్లా మారాయి. మండలపరిషత్ కార్యాలయం సెంటర్, క్రాస్‌రోడ్డు సెంటర్ తదితర ప్రాంతాలలో ఇదే పరిస్థితి. నగరంలో వీధిలైట్లు వెలగకపోవడంతో చిమ్మచీకట్లు అలుముకొన్నాయి. వాహనచోదకులు రాత్రి సమయాల్లో లైట్లు వెలగని కారణంగా ప్రమాదాలకు గురౌతున్నారు. మరోవైపు దొంగల బెడద అధికంగా వుండడంతో వీధిలైట్లు లేకపోవడం మరిన్ని సమస్యలు ఎదురౌతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు పడుతున్న బాధలను గమనించైనా మునిసిపాలిటీ వీధిలైట్లును, సెంట్రల్ లైటింగ్‌ను పునరుద్ధరించాలని నగర ప్రజలు కోరుకొంటున్నారు.

కావలిలో మహిళా దొంగలు!

జరజాగ్రత్త

కావలి పట్టణంలో మహిళా దొంగలు విజృంభిస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. గతంలో ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తూ మహిళలను వెంబడించి నగలు దోచుకొనే ముఠా తిరిగి పట్టణంలో సంచరిస్తుండడంతో బాబోయ్ ఆడ దొంగలంటూ భయపడుతున్నారు. ఆర్టీసి బస్టాండులోనూ, బస్సుల్లోనూ తిరుగుతూ మెడలోని నగలు, బ్యాగులోని నగదు తస్కరిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మాయమాటలతో బురిడికొట్టించి ముగ్గులోకి దించి క్షణాల్లో నగలు, నగదు కాజేస్తుండడంతో మహిళా దొంగల ముఠా దెబ్బకు ప్రయాణీకులు బెంబేలెత్తుతున్నారు.

శాఖ మారుతుందేమో?

● రామనారాయణరెడ్డి సందేహం!

ప్రస్తుతం మునిసిపల్‌శాఖ మంత్రిగా కొనసాగుతున్నా, రేపు ఏ శాఖ మంత్రిగా వుంటానో తెలియదు అని ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. ఆత్మకూరులో జరిగిన ప్రజాపథం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నేను మునిసిపల్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆత్మకూరు పట్టణాన్ని మునిసిపాలిటీగా చేద్దామని ప్రయత్నాలు ప్రారంభిస్తే, స్థానిక పంచాయితీ పాలకవర్గం దానికి అడ్డుపడడంతో అది ఆగిపోయిందన్నారు. ఏది ఏమైనా ఆత్మకూరును 2011నాటికి మునిసిపాలిటీగా మార్చడం ఖాయమన్నారు. 35లక్షల ఖర్చుతో పైపులైన్లు క్రొత్తగా ఏర్పాటు చేయించి మంచినీరు సక్రమంగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుల గురించి ప్రస్తావిస్తూ ఏ శాఖ మంత్రిగా వున్నా ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పథకాలను మాత్రమే ముఖ్యమంత్రి రోశయ్య అమలు చేస్తున్నాడు తప్ప క్రొత్త పథకాలు ఏమి చేపట్టేది లేదన్నారు. శాసనమండలి సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ అనంతసాగరం మండలంలోని కొమ్మలేరువాగు ద్వారా ఆత్మకూరు చెరువుకు నీటిని తరలించినట్లయితే ఈ చెరువులో నీళ్లు ఎల్లప్పుడూ వుంటాయని ఆ దిశగా మంత్రి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనంతపద్మనాభరెడ్డి, డాక్టర్ ఆదిశేషయ్య, సర్పంచ్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో లైలా అలజడి



నెల్లూరు రామలింగాపురం అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి ఎప్పటిమాదిరి డ్రైనేజి నీటితో నిండింది.



నగరంలో హోరుగాలి.



జిల్లా కోర్టు ప్రాంగణంలో పార్కింగ్ చేసిన కారుపై పడ్డ చెట్టు, విద్యుత్ తీగలు.




ఇరుగాళమ్మ గుడి వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన పెద్ద చెట్టు.



కెవిఆర్ పెట్రోల్ బంక్ వద్ద గాలికి క్రిందపడ్డ హోర్డింగ్‌లు.



కలెక్టరేట్‌లో నిరంతర సమీక్షలో జిల్లా కలెక్టర్ రాంగోపాల్.



పాపం రోశయ్య!

ముఖ్యమంత్రి రోశయ్య పరిస్థితి రోజురోజుకు దయనీయంగా తయారవుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రిని మంత్రులు లక్ష్యపెట్టడం లేదన్న విమర్శ వుంది. నగర మంత్రి దానం నాగేందర్ తాజాగా రోశయ్యకు మరో షాక్ యిచ్చాడు. రోశయ్య నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటై యేడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పునరంకిత సభను ఏర్పాటు చేసింది. ఈ నెల 20వ తేదిన జరగనున్న ఈ సభ ఏర్పాట్లను దానం దగ్గర వుండి చేశాడు. ఈ సందర్భంగా దానం నగరంలో పోస్టర్లు, ఫ్లెక్స్ బోర్డుల్ని ఏర్పాటు చేయించాడు. అయితే వీటిలో రోశయ్య బొమ్మ సైజు చిక్కిపోయింది. ప్రభుత్వ సలహాదారులు కెవిపి రామచంద్ర రావు, పిసిసి చీఫ్ డి.శ్రీనివాస్ బొమ్మలు మాత్రం పెద్ద సైజులో వున్నాయి. ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తోంది రోశయ్యే అయినా తెరవెనుక నుంచి నాటకం నడిపిస్తున్నది కె.వి.పి కాబట్టి ఇలా చేయాల్సి వచ్చిందని దానం వర్గీయులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది కాస్తా రోశయ్య దాకా చేరింది. ఇప్పటికే దానం పై కోపంగా వున్న రోశయ్యకు పుండు మీద కారం చల్లినట్లయ్యింది.



తోడల్లుడి 'దెబ్బ'!!

చంద్రబాబుకు బావమరదుల నుంచే కాదు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు నుంచి కూడా తలనొప్పి ఎక్కువైంది. పార్టీలో బాలకృష్ణ పట్ల మోజు పెరగటాన్ని 'బాబు' జీర్ణించుకోలేకపోతున్నాడు. ఈ నెలాఖరులో జరుగనున్న మహానాడులో ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల సమక్షంలో తన ప్రాధాన్యతను చాటి చెప్పాలని బాబు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. సరిగ్గా మహానాడు జరిగే రోజునే దగ్గుబాటి తన గ్రామం కారంచేడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రకటించాడు. దీనికి ఎన్టీఆర్ కుటుంబసభ్యులందర్ని ఆహ్వానించాడు. సెంటిమెంట్‌కు కట్టుబడి బాలకృష్ణతోపాటు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులంతా ప్రత్యేక విమానంలో బయలుదేరి కారంచేడుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో చంద్రబాబు ఖంగుతిన్నాడు. డామిట్ కథ అడ్డం తిరిగిందంటూ తలపట్టుకొని కూర్చున్నాడట. దగ్గుబాటి కాంగ్రెస్‌లో వున్నా కూడా 'బాబు'ను మాత్రం ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడని 'దేశం' వర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి.



రాజకీయ 'బదలీలు'

ఇటీవల జరిగిన ఐఎఎస్ అధికారుల బదలీల్లో రాజకీయ నాయకుల ప్రభావం ఎక్కువగా వుందని సచివాలయంలో చెవులు కొరుక్కుంటున్నారు. ప్రాథమిక విద్యాశాఖ కమిషనర్‌గా పూనం మాలకొండయ్య అదర గొట్టేస్తోంది. ఆమె ఈ పోస్టులోకి వచ్చిన పదకొండునెలల్లో విద్యాశాఖపై తన 'ముద్ర' వేసింది. సహజంగా రెండేళ్ల దాటితేనే ఐఎఎస్ అధికారుల్ని బదలీ చేస్తారు. కానీ పూనంను పదకొండునెలలకే బదలీ చేశారు. అది కూడా ఏ మాత్రం ప్రాధాన్యం లేని శాఖకు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీస్తే... పిసిసి చీఫ్ డి.శ్రీనివాస్ 'మాట' వినందుకే ఈ బదలీ జరిగిందని తేలింది. ఒక అవినీతి అధికారిని తన జిల్లా డిఇఓగా వేయాలని శ్రీనివాస్ కోరాడట. దానికి పూనం 'నో' అందట. ఇంకేముంది డిఎస్‌కు కోపం వచ్చింది. వెంటనే బదలీ జరిగిపోయింది. అలాగే రవాణాశాఖ కమిషనర్‌గా వున్న రేమాండ్ పీటర్‌కు మంచి పేరుంది. గతంలో ఆయనకు మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి సోదరుడు ప్రభాకర్‌రెడ్డికి మధ్య గొడవ జరిగింది. దీన్ని మనసులో వుంచుకొనే పీటర్‌ను 'రవాణా' నుంచి ఏమాత్రం ప్రాధాన్యం లేని 'చక్కెర'శాఖకు బదలీ చేయించడు జెసి దివాకర్‌రెడ్డి. రాజకీయామా? మజాకా?




రామ్‌దేవ్ బాబాపై టిఆర్ఎస్ కన్నెర్ర

యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై టిఆర్ఎస్ మండిపడుతోంది. ఈ నెల మూడోవారంలో రామ్‌దేవ్ బాబా మహా బూబ్‌నగర్‌లో యోగా తరగతుల్ని నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన కొన్ని రాజకీయ వ్యాఖ్యానాలు చేశాడు. చిన్న రాష్ట్రాల ఏర్పాటువల్ల ఉపయోగం లేదంటూ ఖరాఖండిగా చెప్పాడు. పక్కనే వున్న జార్ఖండ్ రాష్ట్రాన్ని ఉదహరిస్తూ అక్కడ పరిస్థితి చేయిదాటడానికి రాష్ట్ర విభజనే కారణమన్నాడు. ఇది ప్రత్యేక తెలంగాణ వాదులకు కోపం తెప్పించింది. బుద్ధిగా యోగా చేసుకోకుండా నీకెందుకు రాజకీయాలంటూ కొందరు టిఆర్ఎస్ కార్యకర్తలు 'బాబా'పై కన్నెర్ర చేశారట. దీంతో 'బాబా'కు సెక్యూరిటీ పెంచేశారు. రాష్ట్రం వదిలి వెళ్లే వరకు 'బాబా'ను కంటికి రెప్పలా చూసుకున్నారు పోలీసులు.



ఆనం అద్దాల మండపం

నెల్లూరు నగరంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు లేవనడానికి వెలుస్తున్న పార్టీ కార్యాలయాలకు సంబంధమే లేదనవచ్చు. పార్టీ కార్యకలాపాలు నిర్వహించుకోను నాగులమిట్ట రోడ్డులో విశాలంగా ఇందిరాభవన్ వున్నా ఆనం బ్రదర్స్ ఎసిసెంటర్‌లో ముందు నగర కాంగ్రెస్ కార్యాలయం పెట్టారు. ఈ కార్యాలయం క్రింద అత్యాధునిక హంగులతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి తన అభిరుచికి తగ్గట్టు ఫైవ్‌స్టార్ హంగులతో ఓ ప్రత్యేక కార్యాలయం పెట్టుకొన్నారు. పాత కార్యాలయానికి సైతం ఈ మధ్య అద్దాల హంగులద్దారు. ప్రస్తుతం ఎసి సెంటర్‌లోని అద్దాల మండపంలో కూర్చొని ఇటు ఆనం సోదరులు అటు వారి కుటుంబ అభిమానులు హల్‌చల్ సృష్టిస్తున్నారు.



సోమిరెడ్డిపై నిప్పులు కక్కిన వివేకా!


జిల్లా రాజకీయాల్లో ఆనం వివేకానందరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉత్తర దక్షిణ ధృవాలు. ఉప్పు నిప్పులా నిత్యం ఒకరిపై మరొకరు కత్తులు దూసుకొంటుంటారు. ఈవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆనం వివేకానందరెడ్డి పలురకాల ఉత్ప్రేక్ష అలంకారాలతో తిట్టిపోశారు. సోమిరెడ్డి నెల్లూరు ఎన్టీఆర్‌భవన్ అనే శిథిల రాజకీయ సౌధానికి కాటికాపరి వంటివాడు. ఆయన వారి పార్టీ నాయకులు బాగుంటేనే చూడలేడు. నిత్యంవారికి తగాదా పెడుతుంటాడు. పూరంతా తగులబెట్టిన పాత కరణానికి, ఆయనకు పెద్ద తేడా లేదు. సర్వేపల్లి నియోజకవర్గం ప్రజలు పదేళ్లుగా తిరస్కరించినా సిగ్గులేకుండా రాజకీయాల్లో వున్నాడు. ఆయన ఓ టూరిస్ట్ నేత. సోమిరెడ్డి ఓ పుల్లల రెడ్డి... విపి అంటూ అడ్డూ ఆపులేకుండా సాగింది వివేకా 'తిట్టు' పురాణం.



బయటపడ్డ గత చరిత్రలు

నెల్లూరు రాజీవ్‌భవన్, నగర కాంగ్రెస్‌నేతలు ఒకరినొకరు దునుమాడుకొంటున్నారు. దీనివల్ల ఆ నేతల చరితలు అసాంతం ప్రజలకు తెలుస్తున్నాయి. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, సీనియర్ కార్పొరేటర్ సందానిబాష మొన్నొకరోజు ప్రెస్‌మీట్ పెట్టి రాజీవ్‌భవన్‌కు కాంగ్రెస్ పార్టీ నుండి ఎటువంటి అనుమతిలేదని, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వారికి వత్తాసు పలకడం విద్దూరమంటూ నిందాపూర్వక వ్యాఖ్యలు చేశారు. దీనికి ప్రతిగా రాజీవ్‌భవన్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల కట్టెల దొడ్డి నుంచి కోటీశ్వరునిగా ఎదిగారని, సందానిబాష సైకిల్ టైర్లకు పంక్చర్లు వేసుకొనే స్థాయి నుంచి ల్యాండ్‌లార్డ్‌గా ఎదిగారని విమర్శించారు. వీటికి ప్రతిగా చాట్ల కట్టెలదొడ్డి నిర్వహణ తప్పు కాదంటూ తమను విమర్శించిన రూప్‌కుమార్‌ను సైకిళ్లదొంగ, జూదగాడు, బెట్టింగ్ బంగారురాజుగా అభివర్ణించారు.

ప్రేమపెళ్లిళ్లు చెయ్యొద్దు!



ఎస్పీ దామోదర్‌కు ప్రేమంటే పొడ గిట్టనట్లుంది. ప్రేమించడం, పెద్దలు కాదంటే తాము మేజర్లమంటూ పోలీసుస్టేషన్లకు వెళ్లి పెళ్లి చేసుకోవడం ఈ మధ్య జిల్లాలో ఎక్కువయ్యింది. పోలీసులే పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుండడంతో వారి తల్లిదండ్రులు కిమ్మనకుండా వుండిపోతున్నారు. ఈ దశలో పోలీసుస్టేషన్లలో ప్రేమపెళ్లిళ్లు చేయవద్దని ఎస్పీ సిఐ, ఎస్‌ఐలకు ఆదేశాలు జారీచేశారు. పిల్లలను పెద్దలు ఎంతో ప్రేమిస్తారని, అటువంటిది వాళ్లు ప్రేమలోపడి వారిపైనా స్టేషన్లలో కేసులు పెట్టి కుటుంబ పరువు బజారు కీడుస్తున్నారని క్లాసు పీకారాయన. ఎస్పీ ఆదేశాలపై పోలీసులు ఏమి వాఖ్యానించకపోయినా ప్రేమికులు మాత్రం ఆయన్ను శాపనార్థాలు పెడుతున్నారు.

పెంచలకోనను మరచిన బాలయ్య!



సింహా చిత్రం విజయవంతమవడంతో రాష్ట్రంలోని అన్ని నృసింహ క్షేత్రాలను నటుడు బాలకృష్ణ సందర్శిస్తున్నాడు. అయితే ఆయన పర్యటనలో జిల్లాలో పేరుగాంచిన నృసింహ క్షేత్రాలు పెంచలకోన, నరసింహకొండలు లేకపోవడం చర్చనీయాంశమయ్యింది. పెంచలకోనలోని పెనుశిల నరసింహస్వామి, నరసింహకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఎంతో మహిమాన్వితులు. అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు, ఎన్టీఆర్ కుటుంబానికి అత్యంత ఆప్తుడు 'రమ్మి' వుండికూడా బాలయ్యను సింహపురికి రప్పించకపోవడాన్ని నందమూరి వంశాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.



కరుణించి కాపాడే లక్ష్మీనృసింహుడు!

కృతయుగాన అవతరించిన నాల్గవ అవతారం నృసింహ అవతారం. తన కుమారుడైన ప్రహ్లాదుడు హరి నామ స్మరణ చేస్తుంటే విని సహించలేని హిరణ్యకశపుడు శ్రీహరి ఎక్కడ నాకు చూపించమనగా స్తంభంలో నుంచి వచ్చి ఉగ్రావతారంలో హిరణ్యకశపుని సంహరిస్తాడు. అయినను కోపం చల్లారక ఉగ్రుడై అడవులలోకి వెళ్లగా దేవతలు ఆయన్ను శాంతింపజేయమని ప్రహ్లాదున్ని కోరతారు. సింహగర్జనలు చేసుకొంటూ అడవుల్లోకి వెళ్లిన నరసింహస్వామిని శాంతించమని వేడుకొంటూ స్వామి పాదాలపై పడి స్తుతిస్తాడు ప్రహ్లాదుడు. లక్ష్మీదేవి సైతం ఉగ్రరూపంలోని స్వామి చెంతకు వెళ్లేందుకు సంశయిస్తుంది. ప్రహ్లాదుడి స్తుతితో శాంతించిన నృసింహుడు తర్వాత నరుడుగా మారి అడవుల్లో సంచరించాడని పురాణాలు చెపుతున్నాయి. లక్ష్మీదేవి ఈ ప్రాంతంలో చెంచురాజు కుమార్తెగా జన్మించింది. నరసింహస్వామి ఆమెను పరిణయమాడి శిలగా మారినట్లు పురాణ కథనం.

లక్ష్మీదేవి సమేతుడైన నరసింహుడు పెనవేసుకొని పెనుశిలగా ఆవిర్భవించారు. వటవృక్షం మూలన స్వయంభువుగా వెలసిన క్షేత్రమే రాపూరులోని పెంచలకోన క్షేత్రము. కాలక్రమంలో పెనుశిలగా, పెంచలకొండగా, తర్వాత పెంచలకోనగా పేరుగాంచింది. నవ నారసింహులలో ఒకడైన పెనుశిల లక్ష్మీ నృసింహస్వామి జగద్విఖ్యాతి చెందారు. రాపూరు కొండలలో కొలువై వుండే నరసింహస్వామిని దర్శించినట్లయితే భూత, ప్రేత, పిశాచ, రాక్షస, గ్రహబాధలు తొలగిపోతాయని పలువురి నమ్మకం. సర్వసంపత్ ప్రధాతగానేగాక, కోరిమొక్కిన వారికి సంతాన భాగ్యం కల్గించే స్వామిగా పేరుగడించారు.

ఈ పెనుశిల క్షేత్రంలో శకుంతల – దుష్యంతులు గాంధర్వ వివాహం చేసుకొన్న అనంతరం ఇక్కడే విహరించారని, వారి కుమారుడు భరతుడు ఈ ప్రాంతంలోనే తిరుగాడినట్లు పురాణాలు చెప్తున్నాయి. అంతేకాక కణ్వ మహర్షి సైతం నృసింహస్వామిని ఆరాధించినట్లుగా పండితులు చెప్తున్నారు. ప్రతి ఏటా వైశాఖ శుక్ల ద్వాదశి నాడు వైభవంగా నృసింహుని జయంతి నిర్వహిస్తారు. ఆనాడు బ్రహ్మోత్సవం జరపడం ఆనవాయితి. ఈ ఏడాది మే 26న నృహింహ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా గల అన్ని నారసింహ క్షేత్రాలలో స్వామి వారికి వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు.



ఆర్థికలావాదేవీలు సరియైన రీతిలో నిర్వహించి విజయం సాధిస్తారు. ఆగిపోయిన పనుల్ని మళ్లీ ఉత్సాహంతో పూర్తి చేస్తారు. కోరినవి కోరిన రీతిలో జరుపుకొంటారు. వృత్తి పురోభివృద్ధి విషయంలో అధిక శ్రద్ధ చూపుతారు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. వృత్తిరీత్యా కొత్తగా ఒప్పందాలు చేసుకొంటారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణ ఉంటుంది.



ఇతరులకు మేలైన సాయాన్నందిస్తారు. మొదలు పెట్టిన పనుల్ని తుదికంటా చేయడానికి స్నేహితులు చేయూతనిస్తారు. వృత్తిరీత్యా చక్కని ఫలితాలుంటాయి. ఆశ్చర్యపడేరీతిలో ప్రియవార్తా శ్రవణం చేస్తారు. చుట్టుపక్కలవారు సన్నిహితులు పొగిడేరీతిలో పనులు చేస్తారు. కుటుంబసభ్యుల నడుమ ప్రతిష్ఠ పెరుగుతుంది. ఖర్చులు ఊహించినంతకంటే అధికంగా ఉంటాయి.




సోదరులు అన్నివిధాల చేయూతనిస్తారు. నూతన ప్రయత్నాలలో అత్యధిక శ్రద్ధ చూపుతారు. పాత సమస్యలకు మంచిపరిష్కారం కనుగొంటారు. దగ్గరి ప్రయాణాలు లాభకరంగా ముగుస్తాయి. ప్రతి పని సులువుగా శ్రమలేకుండా చేసి ముగుస్తారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు కోరుకొన్న రీతిలో జరుగుతాయి. సంతానమూలంగా సుఖశాంతులుంటాయి.



ఉత్సాహం, సుఖసంతోషాలు అధికంగా అనుభూతికొస్తాయి. ఇంటికి కావలసిన వస్తువుల్ని సమకూర్చుకోవడంలో నిమగ్నులై ఉంటారు. ఉద్యోగ స్థానాల్లో మీ పలుకుబడి పెరిగి తృప్తినిస్తుంది. ఆకస్మిక పరిణామాలు ఏర్పడతాయి. కుటుంబసభ్యుల అభిప్రాయాలకు ప్రాముఖ్యమివ్వాలి. వారాంతంలో వృత్తిరీత్యా మీరు తీసుకొన్న నిర్ణయాల్లో హితాత్పరిణామాలు చోటు చేసుకొంటాయి.



ఆప్తమిత్రుల ద్వారా శుభవార్తాశ్రవణం. నియమ నిష్ఠలు, నమ్మకంతో పూజాదులు నిర్వహిస్తారు. వివాహాది శుభకార్యచర్చలు చోటు చేసుకొంటాయి. దాంపత్యసుఖం అన్యోన్యత పెరుగుతుంది. విదేశీపర్యటనలు హాయిగా సాగుతాయి. జాగ్రత్తగా, ఓర్పుతో సదాలోచనతో అడుగేయాలి. ఒకవైపు నిదానం మరొకవైపు ఉత్సాహం చోటు చేసుకొంటుంది. పని నిర్వహణలో జాగ్రత్త అవసరం.



దైవపూజాకార్యక్రమాలతో మనశ్శాంతి లభిస్తుంది. చేతికందిందంతా పూర్తిగా ఖర్చు చేస్తారు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొని ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. కళత్రసంబంధం కొంత వరకు మెరుగు. వ్యాపారాదులలో వచ్చిన నష్టాలను ఒక విధంగా పూడ్చుకొంటారు. బంధుమిత్రులు తమ వంతు సాయమందిస్తారు. అడ్డుతగిలి ఆగిపోయిన పనులు ఊపందుకొంటాయి.

వారఫలాలు

తేది 22-05-2010 నుండి 28-05-2010 వరకు మేషంలో బుధుడు; వృషభంలో రవి; మిథునంలో శుక్రుడు, కేతువు; కర్కాటక, సింహాల్లో కుజుడు; మీనంలో గురువు; కన్యలో శని; ధనుస్సులో రాహువు; వృషభ, మిథున, కర్కాటక, సింహాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు

23, 29తేదీలలో వివాహాదులకు ఉ.4.00 గం.ల నుండి 6.00 వరకు మేషలగ్నాన శుభముహూర్తాలున్నాయి.
26తేది నృసింహజయంతి.
28తేది ఎన్టీఆర్ జయంతి. కర్తీరీ త్యాగం.

మే తిథులు


నిజ వైశాఖ శుద్ధ

22 శని	నవమి	మ.1.43	గం.ల.వ
23 ఆది	దశమి	ఉ.11.36	గం.ల.వ
24 సోమ	ఏకాదశి	ఉ.9.35	గం.ల.వ
25 మంగళ	ద్వాదశి	ఉ.7.47	గం.ల.వ
26 బుధ	త్రయోదశి	ఉ.6.16	గం.ల.వ
	చతుర్దశి	తె.5.07	గం.ల.వ
27 గురు	పౌర్ణమి	తె.4.25	గం.ల.వ

నిజ వైశాఖ బహుళ

28 శుక్ర	పాడ్యమి	తె.4.18	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



మీ కార్యనిర్వహణా సామర్థ్యం బహిర్గతమవుతుంది. స్థిరాదాయానికి తగిన పథకాలు ఏర్పరుచుకొంటారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు ఫలవంతమవుతాయి. కుటుంబంలో సుఖ సంతోషాలు నెలకొంటాయి. ఎలాంటి సమస్యలనైనా ఉత్సాహంగా ఎదుర్కొంటారు. ఆధ్యాత్మికగురువులను కలుసుకొంటారు. నిరీక్షిస్తున్న డబ్బు చేతికందుతుంది. బాకీలు వసూలవుతాయి.




నూతన వాహనప్రాప్తి లేదా వాహన రిపేర్ల అవకాశాలున్నాయి. వృత్తి అభివృద్ధికి తోడ్పడే వ్యక్తుల్ని కలుసుకొంటారు. ఉద్యోగరీత్యా ఎదురుచూసిన ఆర్థిక లాభాలు చేతికి అందివస్తాయి. ముఖ్యులనుండి ప్రియవార్తాశ్రవణం. చుట్టుపక్కలవారితో, బయటప్రపంచంతో సత్సంబంధాలుంటాయి. ఇల్లు, ప్లాటు మొదలైనవి కొనే ప్రయత్నాలు ఊపందుకొంటాయి.



ఎదురుచూసిన బదిలీలు, మార్పులు చోటుచేసుకొంటాయి. నూతనవ్యక్తులతో మెలకువగా నడచుకోవాలి. దైవపూజలలో పాల్గొనాలి. అధికంగా ఖర్చు చేసినా తృప్తి ఉండక పోవచ్చు. దూర ప్రయాణాలు నిరుపయోగాలు. వాయిదా పడ్డ పనులలో కొంత ముందంజ కానవస్తుంది. పై వారితో సత్సంబంధాలుంటాయి. నూతన ప్రయత్నాలు చక్కని ఫలితాలనిస్తాయి.



గృహాలంకరణలో ఆసక్తి చూపుతారు. వృత్తిలో పదోన్నతికి అవకాశాలు మెండు. వేతనోన్నతికి కూడ. వివాహప్రయత్నాలు చక్కగా ఫలిస్తాయి. ప్రయాణాలు సుఖాంతమవుతాయి. ధనాదాయప్రాప్తిలో ఆటంకాలు తొలగుతాయి. ఆత్మవిశ్వాసం పెరిగి పనులు అత్యంత సులువుగా చేసుకుపోతారు. సోదరులకుటుంబానికి సంబంధించి శుభవార్తాశ్రవణం ఉండవచ్చు.



ప్రతిపనిలో నిదానం అవసరం. అప్పుడే మనశ్శాంతి లభిస్తుంది. మీ నిరీక్షణ ఫలించి ఎదురుచూసిన వ్యక్తితో సంభాషణ చేస్తారు. దూరప్రయాణాలు సత్ఫలితాలనిస్తాయి. ఆంత్ర బాధలుండవచ్చు. ధనవిషయంలో లోటుండదు. ఎదురుచూసిన రీతిలో ధనప్రాప్తి. ఆగిపోయిన పనుల్ని హుషారుగా పూర్తిచేస్తారు. ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు. సోదరులతో సత్సంబంధాలు నెలకొంటాయి.



ఇరుగుపొరుగువారితో సంబంధాలు చక్కగా ఉంటాయి. దొంగచాటు శత్రువులు దూరమవుతారు. వైద్యసంబంధిత ఖర్చులు తప్పవు. పొదుపు చేసుకొన్న డబ్బు కరిగి పోయే సమయం. పథకం ప్రకారం చేయదలచిన పనుల్లో ఆటంకాలు. వృత్తిరీత్యా అభివృద్ధికిగాను తోటివారి తోడ్పాటు బాగా లభిస్తుంది. కళత్రసంబంధీకుల నుండి మంచిపరిణామాలు ఎదురు చూడవచ్చు.

'నరఘోష' యంత్రంతో ఆర్థిక పరిపుష్టం!

పురిపండా పద్మనాభరావు *చెన్నై*

** వ్యాపారాలు కలసి రావడం లేదు. ఆర్థికంగా 'దివాలా' ఎక్కువ. ఏదైనా సలహా ఇవ్వగలరా?*

వరుస నష్టాలు, ఆర్థిక దుష్ఫలితాలున్నప్పుడు 'నరఘోష యంత్ర' ప్రతిష్ఠ పరిస్థితిని కుదుటపరుస్తుంది.

పి.జె.ఆర్ *నాయుడుపేట*

** శ్రీవారు పూర్తిగా భ్రష్టులైపోయారు. దిక్కుతోచని స్థితిలో నేను!*

సైకియాట్రిస్ట్‌కి చూపడం వల్ల సైకోథెరఫీ చాలా మేలు చేస్తుంది. పశ్చిమ వాయువ్యం సెప్టిక్ ట్యాంకు దోషం వెంటనే తీసివేయండి.

షేక్ రియాజ్‌అహ్మద్ *తిరుపతి*

** ఖాళీస్థలాల వల్ల కూడా ప్రభావాలుంటాయా?*

మీరు నివాసమున్న గృహానికి ఆగ్నేయం, వాయువ్యం, నైరుతి దిశలలో ఖాళీ ప్లాట్లు వున్నప్పుడు, వాటిని ఏటా శుభ్రం చేయనపుడు తప్పని సరి సమస్యలు ఏర్పడతాయి.

జడ్.జాన్సన్ *నాయుడుపేట*

** జీవితం ప్రశాంతంగా ఉండేది. గృహ నిర్మాణం ప్రారంభించాక సమస్యలు చుట్టుముడుతున్నాయి?*

అవాస్తు గృహ నిర్మాణాల వల్ల సమస్యలు కొని తెచ్చుకున్నట్లే. సలక్షణమైన వాస్తు నిర్మాణాల వల్ల అభివృద్ధి, అవాస్తు వల్ల ఆర్థిక, అనారోగ్య సమస్యలు, మృత్యువు వుంటాయి.

వై.లతీఫ్‌సింగ్ *హైదరాబాద్*

** మూఢం, కత్తెర సమయాల్లో చేయవలసినవి, చేయకూడనివి తెలపండి?*

ఈ సమయాల్లో శంఖుస్థాపనలు, నిర్మాణాలు, శుభకార్యక్రమాలు చేయకూడదు. వాస్తు చూపించడం, ప్లాను తయారు చేయడం, నిర్మాణ సామాగ్రి సరిచేసుకోవడం వంటి పనులు చేయవచ్చు.

డి.సుముఖరావు *ఉదయగిరి*

** వాస్తు, ఆగమశాస్త్రాలు వేరు వేరా?*

అష్టదిక్కుల్లో నిర్మాణాలెలా చేయాలో వాస్తు చెబుతుంది. గోపురం, శిఖరం, దేవకోష్ట, బలిపీఠం, ధ్వజస్తంభం, ప్రదక్షిణ, గర్భగుడిలాంటి ఆలయ విభాగాలను గురించి 'ఆగమశాస్త్రం' చెబుతుంది.

టి.వేంకటాచార్యులు *తిరుపతి*

** ఆలయాలు శిథిలావస్థలో వుంటేనే పట్టించుకోని దేవుడు, ఆస్తులనెలా రక్షించుకోగలుగుతాడు?*

ఆలయ శిథిల కారకులూ, ఆస్తులు ఆక్రమించిన వారు తప్పక శిక్షలు అనుభవిస్తారు. అయితే పాపం పండేంత వరకూ ఆయన మౌనంగానే వుంటాడు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.వి.కె.లావణ్య *సూళ్లూరుపేట*

** గృహనిర్మాణం తర్వాత అనారోగ్యం ప్రారంభమయింది. ఈ మధ్య యాక్సిడెంట్ కూడా జరిగింది.*

గృహనిర్మాణం తర్వాత మూడు నుంచి ఆరు మాసాల్లోగా ఇలా జరిగితే గృహంలో వాస్తు దోషాలున్నట్లు గమనించాలి. సంబంధిత యంత్ర ప్రతిష్ఠ, దోష నిర్మాణాలు పునర్నిర్మించుకోవాలి.

ఎం.చలపతి *నెల్లూరు*

** అంగళ్లు ఎన్ని మార్చినా వ్యాపారాలు అంతంతమాత్రంగానే వున్నాయి.*

సమస్థితి లోపం, సిట్టింగ్, దేవుళ్ల ప్రతిష్ఠ, గల్లాపెట్టె ఇవన్నీ సమస్థితిలో జరిగితే వ్యాపారానికి ఢోకా వుండదు. మీకు తూర్పు, దక్షిణ స్థలాలు మాత్రమే కలసి వస్తాయి.

శీలా ప్రతాపరెడ్డి *కడప*

** నేను ఏప్రిల్ 17, 1952లో జన్మించాను. నాకు ఏ దిక్కు ఇల్లు కలసి వస్తుంది?*

మేషరాశి మీది. అధిపత్యం కుజుడు. మీకు దక్షిణ స్థలాలు కలసివస్తాయి. అయితే తప్పనిసరి ఆగ్నేయ ద్వారం, ఉత్తర, తూర్పు ఈశాన్య ద్వారాలు తెరవాలి.


బోగోలులో పంచాయితీలో తిష్టవేసిన సమస్యలు!

బోగోలు గ్రామపంచాయితీ అన్ని విధాలుగా అభివృద్ధిలో వెనుక బడి వుంది. నిధుల కొరత లేకున్నప్పటికి అభివృద్ధి పనులు చేపట్టే విషయంపై గ్రామ పంచాయితీ పాలకవర్గం సరైన దృష్టి సారించ లేకపోతుంది. త్రాగునీటి సరఫరా రెండు రోజులకోసారి జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడకతప్పడం లేదు. బోగోలు బజారు సెంటర్‌లో వున్న మార్కెట్ లోపల పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా తయారైవుంది. మార్కెట్ లోని షాపుల నుంచి అద్దె వసూలు చేస్తున్న ప్పటికి పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో పాలకవర్గం విఫలం చెందింది.

కూరగాయలు, చేపలు, మాంసం కొనుగోలు చేసేందుకు వెళ్లే వారికి తీవ్ర అసౌ కర్యంగా వుంటున్నది. ఈ గ్రామపంచాయితీ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్రె అక్కులయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పంచాయితీ పరిధిలో చెంచులక్ష్మిపురం, తిప్ప, ఆరవపాళెం, ఎ.కె.వి.కండ్రిగ తదితర కాలనీలు వున్నాయి. అయిదువేల కుటుంబాలు 15వేల జనాభా, 10వేల మంది ఓటర్లున్నారు. గ్రామ పంచాయితీకి ప్రతి సంవత్సరం వివిధ పన్నుల రూపంలో 7లక్షలు, ఎస్‌ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు కలిపి దాదాపు 6లక్షల రూపాయల వరకు విడుదలవుతుంటాయి.

ఇన్ని నిధులున్నా కూడా పంచాయితీ లోని ప్రజల దాహార్తి తీర్చలేకపోతున్నారు. ప్రధాన వీధులలో మాత్రమే సిమెంటురోడ్లు నిర్మించి వుండగా, మిగిలిన అంతర్గత రోడ్లు దుర్భరంగా వున్నాయి. అలాగే వీధులలో వేసిన చెత్తా, చెదారాన్ని పంచాయితీ సిబ్బంది ప్రతి రోజు తొలగించకపోవడంతో కుక్కలు, పందులు చేరి స్వైరవిహారం చేస్తున్నాయి. పారిశుద్ధ్యం మెరుగుపరచకపోవడానికి సిబ్బంది కొరతే కారణంగా తెలుస్తుంది. ఇంతమంది జనాభాకు కేవలం అయిదుగురు మాత్రమే శానిటేషన్ సిబ్బంది వున్నారు. వీరు కూడా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకున్నవారే.


ఇదిలా వుండగా కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు తెలుగుదేశం పార్టీకి చెందిన వాడు కావడం వలన పంచాయితీ అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందించడం లేదన్న విమర్శ వుంది. ఈ క్రమంలో పంచా యితీలోని సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.



త్రాగునీటి ఎద్దడి నివారణకు కృషి!

త్రాగునీటి ఎద్దడి వున్న విషయం వాస్తవం. ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిసరఫరా చేయాలంటే మరో రెండు ఓవర్‌హెడ్ ట్యాం కులు నిర్మించాలి. ఇందుకు అవసరమైన నిధులు విడుదల కావాల్సి వుంది. ప్రజలకు ప్రస్తుతం ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– పర్రె అక్కులయ్య, సర్పంచ్



త్రాగునీటి సరఫరా అధ్వాన్నం!

త్రాగునీటి సర ఫరా అధ్వాన్నంగా వుంది. వేసవి కాలం వచ్చిందంటే నీటి ఎద్దడి తీవ్రంగా వుం టుంది. ఎన్నిసార్లు అధికారులు, పంచాయితీ సర్పంచ్‌లకు విన్నవించుకున్నా ఫలితం కాన రావడంలేదు. ఇప్పటికైన జిల్లాస్థాయి అధికా రులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మస్తాన్



గ్రామంలో పందుల స్వైరవిహారం.



డ్రైనేజి దెబ్బతినడంతో వీధులలోకి మురికినీరు.

అవినీతి కథ

పావలా వడ్డీ పథకం అందని ద్రాక్షపండే!

రాష్ట్ర ప్రభుత్వం గత అయిదు సంవత్సరాల నుంచి అమలు చేస్తున్న పావలా వడ్డీ పథకం అందని ద్రాక్ష పండు అయ్యింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు మం జూరు చేసే రుణాలకు పావలా వడ్డీ వసూలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలుత ఎంతో పకడ్బందీగా అమలు చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆ తర్వాత నిధులు కొరత కారణంగా అమలు చేయలేక చేతులెత్తేశారు. దీంతో పొదుపు గ్రూపు మహిళలు బకాయిల కోసం డిఆర్‌డిఏ కార్యాలయం చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.

పొదుపు గ్రూపు మహిళలను అనతికాలంలోనే లక్షాధికారుల్ని చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన నెరవేరకుండా పోయే అవకాశం ఏర్పడింది. ఆర్థి కంగా ఎదిగేందుకు బ్యాం కుల నుంచి మంజూరుచేసే రుణాలకు లబ్దిదారులు నూటికి రూపాయి వంతున ప్రతి నెల వడ్డీ చెల్లి స్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి సంబంధిత బ్యాంకు నుంచి చెల్లింపుల వివరాలు సేకరించి పావలావడ్డీ పథకాన్ని డిఆర్‌డిఏ – ఇందిర క్రాంతి పథం అధికారులు వర్తింపజేయాల్సి వుంటుంది. లబ్దిదారులు చెల్లించిన రూపాయిలో 75 పైసల వంతున లెక్కకట్టి మొత్తాన్ని పొదుపు గ్రూపు సభ్యుల ఖాతాలోకి జమ చేయాలి.

గత రెండు సంవత్సరాల నుంచి పొదుపు గ్రూపులకు చెల్లించా ల్సిన పావలావడ్డీ బకాయిలు కోట్ల రూపాయల్లోకి చేరుకున్నాయి. రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు మాత్రం రూపాయి వంతున వసూలు చేసుకుంటున్నా పావలావడ్డీ గురించి మాత్రం పట్టించుకునేవారు కరువయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోకి చొచ్చుకు పోయి అధిక వడ్డీలకు రుణాలు అందజేస్తున్న సూక్ష్మరుణ సంస్థల బారి నుండి గట్టెక్కించలేక పోతుంది ప్రభుత్వం. గ్రామీణ ప్రాంతా లకు విస్తరించి మహిళల అవసరాలను ఆసరా చేసుకుని రుణాలు అందించి అనంతరం బకాయిల కోసం పీడిస్తున్న మైక్రోఫైనాన్స్ సం స్థల నుంచి విముక్తుల్ని చేయాలన్న ఉద్దేశ్యంతో దివంగత ముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టారు.

అయితే ఈ పథకం ప్రవేశపెట్టిన సమయంలో చూపించిన శ్రద్ధ అమలు చేసే విష యానికొచ్చేసరికి సంబంధిత శాఖాధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన కొందరు వాటిని తిరిగి చెల్లించినా కూడా నేటికీ పావలా వడ్డీ పథకం వర్తించలేదు. బ్యాంకు నుంచి రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి తిరిగి బ్యాంకులు రుణాలు మంజూరు చేయకుండా మొండిచేయి చూపుతున్నాయి. మరో గత్యంతరం లేకపోవడంతో రుణాల కోసం మైక్రోఫైనాన్స్ సం స్థలను ఆశ్రయించక తప్పడం లేదు.

వారం రోజుల్లోనే మైక్రోఫైనాన్స్ సంస్థలు గ్రామాలకు వెళ్లి అడిగిన మొత్తాన్ని అందజేస్తున్నాయి. వారం వారం వాయిదాలు చెల్లిం చాల్సి వున్నప్పటికీ అవసరాలను తీర్చుకునేందుకు రుణాలు తీసుకుం టున్నామని పొదుపు మహిళలు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం రుణ బకాయిలు సక్రమంగా వసూలు కాకపోవడం వలన తిరిగి రుణాలు మంజూరు చేయడంలో ఆలస్యం జరుగుతున్నదంటు న్నారు. పావలా వడ్డీ పథకం ద్వారా కోట్ల రూపాయల రుణాలు పం పిణీ చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న నేతలు బకాయిల గురించి మాట్లాడడం లేదు. వడ్డీ బకాయిలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో జిల్లా అధికారులు పొదుపుగ్రూపు సభ్యులకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. మొత్తం మీద ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు కావాల్సిన పావలా వడ్డీ పథకం భవిష్యత్‌లో అమలు కావడం అనుమానమే.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసే రుణాలకు వసూలు చేసే పావలావడ్డీ పథకం గ్రామీణాభివృద్ధి శాఖలో నిధుల కొరత కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నది.



అక్రమాలన్నిటికి మౌనసాక్షి నెల్లూరులోని ఇందిరక్రాంతి పథం కార్యాలయం.

జగదేకవీరుడిగా రామ్‌చరణ్!



చిరుత చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసి 'మగధీర'తో మెగారేంజ్‌ను సొంత చేసుకొని ఇప్పుడు 'ఆరంజ్'లో లవర్‌బాయ్ పాత్ర పోషిస్తున్నాడు హీరో రామ్‌చరణ్. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంతో షూటింగ్ జరుపుకుంటోంది. ఇదిగాక ధరణి దర్శకత్వంలో మెరుపు చిత్రంలో నటించడానికి పచ్చ జెండా ఊపాడు. ఇందులో మాస్ హీరోగా రామ్‌చరణ్ మెప్పించనున్నాడు. ఇదిఇలావుండగా రామ్‌చరణ్‌తో ఆయన్ను పరిశ్రమకు పరిచయం చేసిన అగ్రనిర్మాత సి.అశ్వనీదత్ జగదేక వీరుడు-2 చిత్రాన్ని తీయ సంకల్పించారు. ఈ చిత్రానికి కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించనున్నారు. చిరంజీవి-శ్రీదేవి కాంబినేషన్‌లో వచ్చిన 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం ఆబాలగోపాలాన్ని అలరించి రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఆ చిత్రానికి సీక్వెల్‌నే జగదేకవీరుడు-2. వచ్చే యేడాది ఫిబ్రవరిలో ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమవుతుంది.

ముద్దుకు హద్దులేమిటి?



బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్ సరసన 'కైట్స్' చిత్రంలో హాలీవుడ్ నటి బార్బరా మోరి నటించింది. ఈ చిత్రం విడుదల కాకుండానే మరో చిత్రంలో నటించను ఆమెకు ఛాన్స్ దొరికింది. తన బ్లాగు పేజిలో 'కైట్స్' చిత్రం విశేషాలను ఆమె పేర్కొంటూ లిప్‌లాక్ స్టోరీలు నాకేం కొత్త కాదు. హాలీవుడ్‌లో అయితే ప్రేమికుల ముద్దు సన్నివేశాన్ని చిత్రీకరించేటపుడు ఆ అద్భుతాన్ని కళాత్మకంగా అందించేందుకు కెమెరామెన్లు క్రిందా మీద పడుతుంటారు. బాలీవుడ్‌లో మాత్రం చుంబన సన్నివేశాన్ని వదిలేసి పూలుపండ్లు, చిలుకల్లాంటి సీన్లు చూపిస్తుంటారని నసుగుతుంది. ముద్దును హద్దుల్లేకుండా వెండి తెరపై చూపించాలంటుందీ ఈ అమ్మడు.

● బోయపాటి - ఎన్టీఆర్

కాంబినేషన్



బాలకృష్ణకు 'సింహా' చిత్రం ద్వారా పూర్వవైభవం తెచ్చిన దర్శకునిగా బోయపాటి శ్రీనుకు పరిశ్రమలో మంచి గుర్తింపు వచ్చింది. ఈయనతో సినిమాలు తీయను అగ్ర నిర్మాతలు కెఎస్ రామారావు, సి.అశ్వినీదత్, బెల్లంకొండ సురేష్, ఛత్రపతి ప్రసాద్‌లు ముందుకొచ్చారు. సింహాలో బోయపాటి టేకింగ్ నచ్చిన హీరో ఎన్టీఆర్ ఆయన దర్శకత్వంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం శక్తి, బృందావనం చిత్రాల్లో నటిస్తున్న ఎన్టీఆర్ వాటి షూటింగ్ పూర్తయ్యాక బోయపాటి శ్రీను తీసే చిత్రంలో నటిస్తాడు. బాబాయ్‌కు మంచి హిట్ నిచ్చిన బోయపాటి అబ్బాయికి ఎటువంటి హిట్ ఇస్తాడన్నది ప్రేక్షకులు ఎదురుచూడక తప్పదు.

గుర్తుండడం లేదు!



సింహా చిత్ర విజయాన్ని హీరోయిన్ నమిత బాగా ఎంజాయ్ చేస్తుంది. మరికొన్ని తెలుగు చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయని సూచనప్రాయంగా చెప్పింది. షూటింగ్‌లోని ఏ విషయాలు తనకు గుర్తుండవంటుంది ఈ సూరత్‌భామ. నిద్ర లేచినప్పటి నుంచి షూటింగ్ హడావుడి. ఎక్కడ ఏ సీన్‌కు ఏ దుస్తులు వేసుకుంటున్నామో, ఎలాంటి తలకట్టు వుంటుందో తెలియదు. దర్శకుడు చెప్పినట్లు చేసేస్తుంటా. రోజూ వుండే హడావుడిలో నేను నటించిన సినిమాలను చూసుకొనే తీరిక వుండదు. చూడాలన్న కోరిక వున్నా జనాల మధ్య కూర్చొని చూడడం అన్ని సందర్భాల్లో కుదరదు. పాపం అభిమానులు ఫలానా సినిమాల్లో మీ డ్రస్సు, హేర్‌స్టైల్ బాగుందని నన్ను కలిసినప్పుడు చెబుతుంటారు. నేను నవ్వి ఊరుకోవడం మినహా ఏం చేయలేకపోతున్నానని వున్న విషయాన్ని వున్నట్లుగా చెప్పింది నమిత.

త్రిష బందోబస్తు!



నటి త్రిష తన సెక్యూరిటి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకొంటుంది. తాజాగా తన ఇంటికి వాయిస్ లేజర్ సిస్టమ్‌ను అమర్చింది. త్రిష లేదా ఆమె తల్లి గడప ముందు నిలబడి మాట్లాడితేనే ఇంటి తలుపులు తెరచుకొంటాయి. ఈ వ్యవస్థను ఆమె విదేశాల నుంచి తెప్పించింది. ఈ గడపతో త్రిష ఇంటికి వచ్చే సందర్శకులు నానా పాట్లు పడుతున్నారు. త్రిషకు సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులు బయటపడినప్పటి నుంచి ఆమె ఎక్కడ బస చేసినా పలు జాగ్రత్తలు తీసుకొంటుంది.



✍ అల్లూరు రహీం

ఒకప్పుడు వరుస విజయాల చిత్ర నిర్మాతగా పరిశ్రమలో పేరుగాంచిన దిల్ రాజుకు టైమ్ బాగోలేనట్లుంది. అందువల్లే ఆయన ఈ మధ్య తీస్తున్న చిత్రాలు పెద్దగా ఆడడం లేదు. జోష్, మరోచరిత్ర చిత్రాల తర్వాత చాక్లెట్ బాయ్‌గా పేరుగాంచిన హీరో రామ్‌ను పెట్టి ఆయన తీసిన తాజా చిత్రం రామ రామ కృష్ణ కృష్ణలో పసలేదు. రొటీన్ కథ, కథనంతో ఈ చిత్రం నడుస్తుంది. గతంలో 'లక్ష్యం' వంటి విజయవంతమైన చిత్రానికి దర్శకునిగా పని చేసిన శ్రీవాస్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లేతోపాటు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. కానీ ఆయన 'దిల్ రాజు' జోక్యం వల్ల కాబోలు ఇటు కథకు, అటు చిత్ర విజయానికి ఉపయోగపడే వినోద, వాణిజ్యపర అంశాలపై దృష్టి పెట్టలేక పోయాడు. లీడర్ చిత్రంలో రెండో హీరోయిన్‌గా పరిచయమైన ప్రియా ఆనంద్‌ను ఈ చిత్రంలో మెయిన్ హీరోయిన్‌ను చేశాడు. బిందు మాధవి రెండో హీరోయిన్. వీరిద్దరూ యూత్‌ను అంతగా ఆకర్షించలేకపోయారు. హీరో రామ్‌కు మస్కా ఇచ్చిన కిక్కును రామ రామ కృష్ణ కృష్ణ దించేసింది. ఇదేదో గొప్ప చిత్రం అయినట్లు రామ్ తెరపై కనిపించే సమయంలో హీరో ఎన్టీఆర్ తన గొంతుతో ఆయన పాత్ర గొప్పతనాన్ని చెప్పాడు. కానీ సినిమా చూస్తే అంతలేదు. అయితే ఈ చిత్రంలో చెప్పుకోవాల్సింది సంగీత దర్శకుడు కీరవాణి, కెమెరామెన్ శేఖర్.వి.జోసఫ్‌ను. కీరవాణి తన ధోరణికి భిన్నంగా మాస్ పాటలు రామ రామ కృష్ణ కృష్ణ, తూ.గో జిల్లా పిల్లా పాటలకు మంచి సంగీతమందించాడు. తూ.గో జిల్లా పాటను పంజాబీ గాయకుడు దలేర్ మెహంది చేత పాడించడంతో విలక్షణంగా వుంది. గోదావరి జిల్లాలోని గ్రామాలు అక్కడి పచ్చటి పొలాలను నీరు తగ్గినా ఏమాత్రం తగ్గని గోదావరి అందాలు కెమెరామెన్ అద్భుతంగా చూపాడు. నెల్లూరీయుడు రత్నం ఈ చిత్రానికి ప్రతిభావంతంగా మాటలు వ్రాయలేక పోయాడు. ఈ మధ్య ప్రతి సినిమాలో ప్రత్యేకపాత్రలో మెరుస్తున్న 'బ్రహ్మానందం' కూడా లేచిపోయిన సుబ్బారావు పాత్రలో నవ్వులు రువ్వించలేకపోవడానికి దర్శకుడు శ్రీవాస్ శ్రద్ధ పెట్టక పోవడమే కారణమని చెప్పక తప్పదు.

చిత్ర కథలోనికి వెళ్తే ముంబాయిలో మాఫియా డాన్లుగా వెలుగొందే అశోక్‌దేవా(అర్జున్), పవార్ (ఖన్నా)లకు పొడగిట్టదు. డిజిపి (సాయాజిషిండే) కుమార్తెను చెరచిన పవార్ చిన్న కుమారుడ్ని అశోక్ దేవా ఇండియా గేట్ వద్ద అంతమొందిస్తాడు. దీనికి ప్రతిగా పవార్ అశోక్ దేవా సతీమణి గౌతమి(గ్రేసిసింగ్)ను ఆమె జన్మదినోత్సవం నాడే కాల్చి చంపుతాడు. భార్య చివరి కోరిక మేరకు అశోక్‌దేవా ముంబాయి వదలి తన ఇద్దరి చెల్లెళ్లు ప్రియ(ప్రియా ఆనంద్), శిరీష (శిరీష)ను తీసుకొని గోదావరి జిల్లాల్లోని గాంధీపురం గ్రామానికి వచ్చేస్తాడు. రైసుమిల్లులు కొని వాటిని నడుపుకొంటుంటాడు. ఈ గ్రామ సర్పంచ్ చక్రపాణి(నాజర్) కుమారుడే రామకృష్ణ(రామ్). గ్రామంలో రామునిగా, కృష్ణునిగా వ్యవహరిస్తూ పైలాపచ్చీసుగా తిరుగుతుంటాడు. చక్రపాణి పెద్ద కుమారుడు ఆనంద్, అశోక్‌దేవ చెల్లెలు శిరీష పట్టణంలో ఎంబిబిఎస్ చదువుతూ ప్రేమించుకొంటారు. గ్రామంలో తమ కుటుంబాలకు పొడగిట్టక పోవడం వల్ల వీరు ముంబాయిలో వుండే ఆనంద్ చిన్నాన్న లేచిపోయిన సుబ్బారావు(బ్రహ్మానందం) వద్ద ఆశ్రయం పొందుతారు. వీరిద్దరిని వెతకను బయలుదేరే రామకృష్ణ, ప్రియల మధ్య కొంత కెమిస్ట్రీ జరుగుతుంది. అంతకు మునుపే రామకృష్ణ మరదలు బిందు(బిందుమాధవి) అతన్ని తాళి కట్టమని తెగ సతాయిస్తుంది. ముంబాయి రైల్వేస్టేషన్‌లో దిగే రామకృష్ణ, ప్రియా లతోపాటు వుండే శివను పవార్ గ్యాంగ్ చూస్తుంది. అశోక్‌దేవ చనిపోలేదన్న నిర్ణయానికి వచ్చి వారి వెనుక పడుతుంది. ఈ దశలో పవార్ చిన్నకొడుకును రామకృష్ణ అనుకోని విధంగా కాల్చేయాల్సి వస్తుంది. పవార్ గ్యాంగ్ నుంచి తప్పించుకొని రామకృష్ణ, ప్రియ, శిరీష, ఆనంద్‌లు గ్రామానికి వచ్చినా మాఫియా గ్యాంగ్ మాత్రం వదలదు. నాటకీయంగా రామకృష్ణ పెద్దలను ఒప్పించి తన అన్న ఆనంద్, శిరీషల పెళ్లికి ఏర్పాట్లు చేస్తాడు. ఇంతలో పవార్ గ్యాంగ్ గాంధీపురం వస్తుంది. ముంబాయిలో జరిగిన గందరగోళాన్ని శివ ద్వారా తెలుసుకొన్న అశోక్‌దేవ కూడా రామకృష్ణతో చేయి కలుపుతాడు. ఇద్దరు కలసి గ్రామ పొలిమేర్లలోనే మాఫియా ముఠాలను అంతమొందించడంతోపాటు తన చెల్లెలు ప్రియను రామకృష్ణ కిచ్చి పెళ్లి చేయడంతో సినిమా ముగుస్తుంది.

చిత్ర సమీక్ష

పేరు తప్ప పసలేని రామ రామ కృష్ణ కృష్ణ!

హీరో రామ్ ప్రతిభ ఈ చిత్రంలో బూడిదలో పోసిన పన్నీరయ్యింది. మాఫియా డాన్‌గా, చెల్లెళ్లకు అన్నగా అర్జున్ మంచి పాత్రలో మెరిసాడు. మిగతా పాత్రలు చర్చించుకోవాల్సినంత గొప్పగా లేవు.

భూ సేకరణపై కలెక్టర్ దృష్టి

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మూల మైన భూసేకరణను వేగవంతంగా పూర్తిచేసేం దుకు జిల్లా రెవిన్యూ యంత్రాంగం దృష్టి సారిం చింది. ముత్తుకూరు మండలంలో నాలుగువేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్న అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టుకు అవసరమైన యాష్–పాండ్, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి మరికొంత భూమి అవసరమవుతుంది. 190 ఎకరాలు వెం టనే కావాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 1600 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్న

ప్రాజెక్టులు పూర్తికావని ఆవేదన

ఎపి పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు మరో 100 ఎకరాలు, నేలటూరు వద్ద పర్యావరణం, టౌన్ షిప్ కోసం 250 ఎకరాలు అవసరమవుతాయి. అలాగే కృష్ణపట్నం ఓడరేవు అవసరాల నిమి త్తం రైల్వేలైను రెండవ దశ నిర్మాణం కోసం వెంకటాచలం – ఓబులాపురం మధ్యలోని ఐదు మండలాల్లో భూసేకరణను వేగవంతం చేయాల్సి వుంది. రాపూరు మండలంలో భూసే కరణ పెండింగ్‌లో వుంది. జిల్లా కలెక్టర్ రాం గోపాల్ ఇటీవల ఈ విషయమై అధికారులతో సమీక్షా సమావేశం పెట్టారు. భూసేకరణ జరగ కపోవడంతో జిల్లాలో వివిధ ప్రాజెక్టులు నత్త నడకన నడుస్తున్నాయని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

జయచంద్రరాజుకు ఘనస్వాగతం పలుకుతాం!

పోలీస్‌శాఖలో అవినీతి, అధికారుల గ్రూపు రాజకీయాలకు విసిగి తన ఉద్యోగానికి రాజీనామా చేసిన కర్నూలు సిఐ జయచంద్ర రాజు అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన జిల్లాకు రానున్న సందర్భంగా రెడ్‌కా ర్పెట్ స్వాగతం పలుకుతామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డి తెలిపారు. జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూ రులో ఎసిబి సిఐగా పనిచేసిన జయచంద్రరాజు

సోమిరెడ్డి వెల్లడి

నీతినిజాయితీకి మారుపేరన్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లకు సంబంధించి జరిగిన భూముల అమ్మకాల్లో జరిగిన అక్రమాలపై 300లకు పైగా కేసులు నమోదు చేశారని, అలాంటి అధి కారిని రాజకీయ వత్తిళ్లతో అధికారులు బదలీ చేశారని విమర్శించారు. దీనికి నిరసనగా ఉద్యో గానికి రాజీనామా చేసి పాదయాత్ర చేపట్టిన జయచంద్రరాజు నగరానికి వస్తే తెలుగుదేశం పార్టీ తరపున సాదర స్వాగతం చెప్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పు తెలుసుకొని జయచంద్రరాజును గౌరవించి ఉద్యోగం ఇవ్వా లని సూచించారు.

నేనొక్కడినే సరిదిద్దలేను!

ట్రాఫిక్ నియంత్రణపై చేతులెత్తేసిన ఎస్పీ!

ఎస్పీ దామోదర్ నెల్లూరు ప్రెస్ క్లబ్‌లో మీట్‌ది ప్రెస్ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జర్నలిస్టులు అడిగే శాఖాపరమైన ప్రశ్న లకు సమాధానం చెప్పాల్సింది పోయి జర్న లిస్టులు ఎలా నడుచుకోవాలన్న దానిపై సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. నేర వార్తలు వ్రాసే సమయంలో అన్ని యదార్థాలు వ్రాస్తే పోలీసులకు ఇబ్బందులు తప్పవన్నారు. విఐ పిల పర్యటనలో తరచూ మార్పుచేర్పులు జరుగుతుంటాయని వీటికి అనుగుణంగా పోలీసు శాఖ చర్యలు తీసుకొంటుందన్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రోశయ్యకు ప్రత్యేక తరహాలో బందోబస్తు ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. నెల్లూ రులో ట్రాఫిక్‌ను సరిదిద్దడం ఒక్క పోలీసు శాఖ బాధ్యతకాదని ఎస్పీ తేల్చి చెప్పేశారు.



ఎస్పీ దామోదర్.

ట్రాఫిక్ గాడిలో పడాలంటే కార్పొరేషన్, ఆర్ అండ్ బి, రవాణా శాఖాధికారులు కూడా సహకరించాల్సి వుందన్నారు. కానీ ఈ విషయంలో పోలీసు శాఖపైనే పత్రి కల్లో విమర్శలు వస్తున్నాయన్నారు.

కూల్‌డ్రింకులు తాగొద్దు!

రోజురోజుకు అధికం అవుతున్న ఎండల నుంచి, వేసవి తాపం నుంచి బయటపడేందుకు కూల్‌డ్రింక్స్‌ను తాగడం సహజం. క్షణాల్లో దప్పిక తీరినట్లు అన్పిస్తుండడం, అభిమాన హీరోలు అద్భుత వ్యాసాలు చేస్తూ కూల్‌డ్రింక్ కంపెనీల ప్రకటనల్లో నటిస్తుండడంతో వీటిపట్ల పలు వురు ఆకర్షితులవుతున్నారు.

ఈ విషయంలో ప్రజలకు వాస్త వాలు తెలియజెప్పేందుకు జనవిజ్ఞాన వేదిక నడుం బిగించింది. నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో కూల్‌డ్రింకులతో టాయి లెట్‌లు శుభ్రపరచి వాటిలో వుండే రసా యనాల ప్రభావాన్ని ప్రజలకు కళ్ళకు కట్టి నట్లు చూపించారు. శాసన మండలి సభ్యుడు వి.బాలసుబ్రహ్మణ్యం, జెవివి కార్య

జనవిజ్ఞాన వేదిక ప్రచారంలో ఎమ్మెల్సీ



జనవిజ్ఞాన వేదిక ప్రచారంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం.

కూల్‌డ్రింక్‌లు త్రాగడం ఆరోగ్యానికి హానికరమే తప్ప మేలు లేదని 2003 సం వత్సరంలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్వి రాన్‌మెంట్ అనే సంస్థ తెలియజెప్పింది. వీటిలో నిర్ణీత స్థాయి కంటే 70 రెట్లు అధికంగా విష రసాయనాల అవశేషాలు న్నాయని పరిశోధనాత్మకంగా చాటిచెప్పింది. 2004లో శరద్‌పవార్ నేతృత్వంలో ఏర్పా టైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సైతం దీనిని నిర్ధారించింది. అయితే ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి చర్య చేపట్ట కుండా కేవలం పార్లమెంటు ప్రాంగణంలో కూల్‌డ్రింక్‌ల అమ్మకాలు జరపకుండా నిషే ధం విధించి చేతులు దులుపుకొంది. దర్శి శంకరయ్య తదితరులు పాల్గొని కూల్‌డ్రింక్స్ వలన కలిగే హానిని తెలియ జెప్పారు. వాటిలో వాడే ఫాస్ఫోరిక్, కార్బో నిక్ ఆమ్లాల వలన జీర్ణాశయంలో పుండ్లు ఏర్పడి క్యాన్సర్‌కు దారితీస్తుందని హెచ్చ రించారు. దంతాలు, ఎముకల్లో కాల్షియం తగ్గిపోతుందని, శాకరిన్, చక్కెర వల్ల స్థూల కాయం వస్తుందని, కెఫిన్ వల్ల నాడి వ్యవస్థ, గుండె కొట్టుకొనే వేగం తగ్గు తుందని, ఇ–150 అనే రంగు వల్ల బి–6 విటమిన్ లోపం ఏర్పడుతుందని చెప్పారు. జెవివి హెచ్చరికల కారణంగా జనం కూల్‌డ్రింకులను తాగడం తగ్గిస్తా రేమో చూడాలి.

వైభవంగా వర్షతప్ ఉత్సవం!

జైనులు ఎంతో నియమనిష్టలతో ఆచరించే వర్షతప్ ఉపవాస దీక్షల ముగింపు ఉత్సవం విఆర్ కళాశాల మైదానంలో వైభవంగా జరి గింది. నగరంలోని జైన మతస్తులతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన జైనులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. 14 నెలలపాటు ఉపవాస దీక్షలు చేపట్టిన వారు దీక్ష విరమణ సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తుం టారు. ఈ సారి 124 మంది ఉపవాస దీక్షలను చేపట్టడం విశేషం.



వర్షతప్‌ను పురస్కరించుకొని విఆర్ కాలేజి మైదానంలో ఉపవాసదీక్ష ముగించిన మహిళలను ఆశీర్వదిస్తున్న జైన మత గురువు.

నగరంలోని మండపాలవీధిలో గల శ్రేయోనాథ్ మందిరం నుంచి బయలుదేరిన ఊరేగింపు విఆర్ కళాశాల వరకు సాగింది. బాజాభజం త్రీలు, మేళతాళాలతో, గుర్రాలు, వాహనాలతో జైనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న జైన మత గురువు ఉదయ ప్రభాస్ మహారాజ్ తన సందేశాన్నిచ్చారు. భారతీయ సంస్కృతి ప్రపం చానికి ఆదర్శమని, భిన్నమతాలు ఒకటిగా గడపడం భారతదేశంలోనే చెల్లిందన్నారు. అంతటి ఉత్కృష్టమైన సంస్కృతి సాంప్రదాయాలను పాశ్చాత్య ధోరణులను నేటి యువత ప్రక్కన పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో శాంతి సామరస్యాలను పెంపొందించేందుకు, కలసిమెలసి వుండేందుకు, అహింసా మార్గాన్ని పాటించేందుకు ఈ ఉప వాస దీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. 14 నెలలుగా ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి చెరకు రసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాకోడ్ జైన్, మహావీర్ జైన్ మండళ్ల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి.



నెల్లూరులోని జైన్‌గోల్డ్ షోరూంలో వారం వారం నిర్వహిస్తున్న లక్కీడ్రాలో విజేతకు స్కూటీని బహుకరిస్తున్న ట్రాఫిక్ సిఐ ఎస్.రాఘవరావు. ప్రక్కన షోరూం ఎండి నరేంద్రజైన్.



నెల్లూరు చంద్రారెడ్డి డిగ్రీ కాలేజీలో చదువుతూ ఫైనల్ డిగ్రీ ఫలితాల్లో 92 శాతం మార్కులు సాధించిన మెహర్‌తాజ్‌ను అభినందిస్తున్న కాలేజి కరస్పాండెంట్ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

రేషన్‌కు వచ్చే ఎల్‌ఆర్‌ఎస్, బివిఎస్ నిధులు ఖర్చు పెట్టడానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆమోదం కావాలనడం స్థానిక సంస్థలకు ఉన్న అధికారాలను, హక్కులను కాలరాయడమేనని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

కొత్త డిపిఆర్వో!

నెల్లూరు ప్రజా పౌరసంబంధాల శాఖాధికారి (డిపిఆర్వో)గా భాగి నారాయణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. నారాయణమూర్తి ప్రజా పౌరసంబంధాల శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. మంచి అధికారిగా పేరుగడించారు.

పాత డిపిఆర్వో జె.యు.కె ప్రసాద్‌కు ఆ శాఖ జెడిగా ప్రమోషన్ వచ్చింది. ఆయన హయాంలో సమాచార శాఖ కార్యాలయాన్ని గబ్బు పట్టించారు. కొత్త డిపిఆర్వో ఆ గబ్బును వదిలించనే శ్రమించాల్సి వుంది.

శ్రీధర్‌కృష్ణారెడ్డికి సన్మానం!

ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిని చిరంజీవి సేవా సమితి నేతృత్వంలో 16వ తేది బాలాజీనగర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిరంజీవి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవ చేస్తున్నానన్నారు. నగరంలో అభివృద్ధి పనులు ఆగకుండా వుండేందుకు అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ నేతలతో రాసుకపూసుక తిరుగుతున్నట్లు ఒప్పుకున్నారు.

కోన బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

ఈ నెల 23వ తేది నుంచి 28 తేది వరకు పెంచలకోన నృసింహుని బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 24వ తేది శేషవాహన సేవ, 25వ తేది బంగారు హనుమంతసేవ, 26వ తేది బంగారు గరుడ వాహన సేవ, 27వ తేది స్వామివారి కళ్యాణం జరుగుతుంది. ఉత్సవాలకు 300లకు పైగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు నెల్లూరు ఆర్డీఓ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. పాలకవర్గం లేకపోవడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఆర్డీఓనే పర్యవేక్షిస్తున్నారు. పెంచలకోన దేవస్థానం వద్ద ముందు జాగ్రత్తగా రెండు అంబులెన్సులు, పటిష్ట బందోబస్తుతోపాటు రోడ్డుకు కూడా మరమ్మత్తులు చేయిస్తున్నట్లు ఆర్డీఓ చెప్పారు.

రోహిణి కార్తె రాకమునుపే...

రోహిణి కార్తె రాకమునుపే నెల్లూరులో ఎండలు అదరగొట్టాయి. ఎండ తీవ్రతకు చిన్నాపెద్దా తేడా లేకుండా అల్లాడిపోయారు. 11వ తేది ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 42.2 డిగ్రీలు నెల్లూరులో నమోదయ్యింది. గడచిన వారంలో తేదీల వారీగా ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే 9వ తేది 39.9, 10వ తేది 41.3, 11వ తేది 42.2, 12వ తేది 41.8, 13వ తేది 40.6, 14వ తేది 40.9, 15వ తేది 39.9, 16, 17 తేదీల్లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. 18వ తేది బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ మూలంగా ఉష్ణోగ్రత కాస్త తగ్గింది. ఎండల మూలంగా ఈ వారంలో జిల్లాలో 20 మంది వడ దెబ్బకు గురై ప్రాణాలొదిలారు.

ఎవరు తెలివైన వారు!

రైతుల సమస్యల మీద వినతిపత్రం ఇవ్వడానికి ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసుకు వచ్చిన చంద్రబాబు తన తెలివినంతా ప్రదర్శించారు. ఆఫీస్ బయట, రోడ్డు మీద విలేఖరులు ఎర్రటి ఎండలో ఆయన కోసం ఎదురుచూస్తున్నారు. ఆ రోడ్ మీద ఎత్తుగా డివైడర్లు వుంటాయి. వాటిని దాటి విలేఖరులను రానివ్వరు. విలేఖరులతో మాట్లాడడానికి నాయకులే ఆ డివైడర్ వద్దకు వస్తున్నారు. కానీ చంద్రబాబు తెలివిగా ప్రహరీ గోడ పక్కనున్న చెట్టు క్రింద నిలబడి, తను వెంట తెచ్చుకొన్న మైక్ తీసుకొని ప్రసంగించడం ప్రారంభించారు. దాదాపు ముప్పావు గంట ఆయన ఊకదంపుడు వినక తప్పని విలేఖరులకు ఓపిక నశించింది. ఆయనకు ఒక ప్రశ్న వేయడానికి కూడా ఏ విలేఖరి ముందుకు రాలేదు. ఆయనటు పోగానే సిపిఎం, సిపిఐ నాయకులు అదే తరహా వినతి పత్రం ఇవ్వడానికి సిఎం క్యాంప్ ఆఫీస్‌కు వచ్చారు. కానీ వారికి చంద్రబాబుకున్నంత తెలివి లేదు. వారు గేటు దాటి బయటకు రావడం చూసిన విలేఖరులు తమ వైపు రోడ్డుమీద వున్న చెట్టు క్రింద నిలబడ్డారు. నాయకులు ఎండలో డివైడర్ ప్రక్కన ఎండలో నిలబడి విలేఖరులతో మాట్లాడక తప్పలేదు. దాన్ని బట్టే చంద్రబాబు తెలివి ఏమిటో అర్థమౌతుంది.

అయితే వైఎస్ అధికారంలో వున్న ఐదున్నర ఏళ్లు మాత్రం సాదరంగా ఎందుకు ప్రవరిస్తున్నాడన్నది ప్రశ్న. వైఎస్ ఉన్నప్పుడు, సాంప్రదాయ బద్ధంగా జరగవలసిన స్పీకర్ ఎన్నిక, తేనీటి విందులకు కూడా హాజరు కాలేదు చంద్రబాబునాయుడు. అసెంబ్లీలో మాత్రం వీరిద్దరూ ఎదురు పడేవారు. కానీ రోశయ్య పిలిచినా పిలవకపోయినా దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని ముఖ్యమంత్రిని కలవడానికి, ఒకే వేదిక మీద మాట్లాడడానికి ఇష్ట పడుతున్నాడు చంద్రబాబు. రోశయ్య మీద ఆయనకు అంత అభిమానం ఎందుకో ఆయనకే తెలియాలి.

చిగురిస్తున్న ఆశలు

16వ పేజీ కొరవ

ఉత్సాహంతో ఇప్పుడు పులిచింతల యాత్ర తల పెడుతున్నాడు. అది కాగానే మరొక కారణం చూపి కోస్తా ఆంధ్ర, రాయలసీమలు మొత్తం పర్యటించాలని కోరిక అట.

చిరంజీవిలో ఇంత కోరిక కలగడానికి కారణం, ప్రతిపక్షంగా తెలుగుదేశం పార్టీ నిలదొక్కుకోలేక పోతున్నదన్న అభిప్రాయం. రోశయ్య ప్రభుత్వం ఎంత విఫలమౌతున్నా చంద్రబాబు దాని నుంచి రాజకీయ లబ్ధి పొందలేక పోతున్నాడని, ఆయన రేటింగ్ పెరగడం లేదని ప్రచారం వుంది. దాన్ని చిరంజీవి కూడా విశ్వసిస్తున్నాడు. కాంగ్రెస్ చీలిపోయి, తెలుగుదేశం బలహీనంగా వున్నప్పుడు తానే పైచేయి సాధించవచ్చునన్న నమ్మకం బలపడింది. దానితో వేసవి సెలవులకు స్విట్జర్లాండ్ విడిదికి బదులుగా ఎర్రటి ఎండలో జనం మధ్యకు వచ్చాడు.

సంక్షోభం తప్పదా?

మొదటి పేజీ కొరవ

మన్మోహన్‌సింగ్ నీకు ఇబ్బంది ఏమి వుంది, నీ పేరు సోనియాగాంధీ ఎప్పుడో ఖరారు చేసిందని చెప్పాడట. ఆ వార్త బయటకు పొక్కినప్పటి నుంచి జగన్‌లో కోపం కట్టలు తెంచుకొంటున్నది. తాను వద్దు అని చెప్తున్నా హనుమంతరావును అక్కున చేర్చుకోవడం అంటే, తన మాటకు అధిష్టానం విలువ ఇవ్వడం లేదనే రుజువు కాబట్టి, ఇక వారితో తనకు మొగమాటం లేదని ఆయన ఆవేశ పడుతున్నాడు.

హనుమంతరావు రంగంలోకి దిగితే, తాను ఏడవ అభ్యర్థిని నిలబెట్టడం ఖాయమని జగన్ సవాలు విసురుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ పట్ల తన తిరుగుబాటుకు ఈ ఎన్నికను వేదిక చేసుకోవాలన్నది ఆయన అభిప్రాయం. దీనికి ఆయన వర్గం మంత్రుల నుంచి కూడా మద్దతు లభిస్తున్నది. ఆ శిబిరంలో జరుగుతున్న చర్చలు, రూపొందిస్తున్న ప్రణాళికలు సునిశితంగా గమనిస్తే రాష్ట్ర రాజకీయం తుఫాను రూపం సంతరించుకోవడం ఖాయమన్పిస్తున్నది. జగన్ సవాలుకు వెరిసి హనుమంతరావును పక్కనపెట్టి, ప్రస్తుతానికి గొడవ లేకుండా చూసుకోవడం ఒకటే అధిష్టానం ముందున్న మార్గం. వారు కూడా జగన్ వలె మొండి పట్టుకు పోతే మాత్రం, రోశయ్య ప్రభుత్వ సంక్షోభంలో పడిపోతుంది. దాని పరిణామాలు ఎట్లా వుంటాయో, అసలు ప్రభుత్వం నిలుస్తుందో కూలిపోతుందో ఇప్పుడే చెప్పలేము.

ఆగని అవినీతి

5వ పేజీ కొరవ

చూడడంతో ఆశ్చర్యపోక తప్పదంలేదు. కూలీల పేర్లు తప్పుగా వుండడం, కూలీలకు బదులు యంత్రాలతో పనులు చేయించినట్లు రికార్డులలో పేర్కొనడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు. ఈ పథకంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకునే అధికారం విజిలెన్స్ అధికారులకు లేక పోయినా ప్రభుత్వానికి నివేదించి చర్యలకు సిఫార్సు చేస్తారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 4లక్షల కుటుంబాలకు 4లక్షల 25వేల జాబ్‌కార్డులను అందజేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. జాబ్ కార్డుల ప్రకారం 70కోట్ల మేర నిధులు ఖర్చు చేయడం జరిగింది. జాబ్‌కార్డులు జారీ చేసినట్లు చెబుతున్న వారిలో కొంతమంది మరణించిన వారు కాగా మరికొందరు గ్రామాలలో లేనివారు వున్నారు.

వీటన్నింటిపై కూడా విజిలెన్స్ అధికారులు సమగ్రంగా విచారణ చేస్తున్నారు. ఈ పథకం జిల్లాలో ప్రారంభమై ఐదు సంవత్సరాలు గడిచిన తర్వాత రాష్ట్రప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం శుభపరిణామం. విచారణ నివేదికలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

రత్నం జూనియర్ కాలేజి అవగాహన సదస్సు

ఇప్పటికి లక్షలాది మందిని ఇంజనీర్లు, డాక్టర్లుగా తయారుచేసిన రత్నం విద్యాసంస్థల నేతృత్వంలో సరికొత్త రూపుతో రత్నం జూనియర్ కాలేజి మళ్లీ ప్రారంభమయ్యింది. లక్ష్యాన్ని ఎలా ఛేదించాలో బోధించే గురువులు, సగటు విద్యార్థిని సైతం విజేతగా నిలిపే ప్రణాళికలు ఈ జూనియర్ కాలేజి రూపొందించింది. వీటిని 16వ తేది నెల్లూరు కస్తూరిదేవి స్కూల్ ఆడిటోరియంలో విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి తెలియజెప్పింది. విద్యా సంస్థల వినూత్న ప్రణాళిక ఫైవ్ స్టెప్స్ ప్రోగాంను విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ సవివరంగా చెప్పారు. విద్యాసంస్థల ఛైర్మన్ కె.వి.రత్నం, డైరక్టర్ కె.వేణుగోపాల్, అకడమిక్ డైరక్టర్ కృష్ణమోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధర్మారెడ్డి మరణం

మాజీ మునిసిపల్ కమిషనర్ మలుచూరి ధర్మారెడ్డి (83) 14తేది నెల్లూరులో మరణించారు. ధర్మా రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన మంచి కళాకారుడు, రచయిత. మరణించే ముందు వరకు నెల్లూరు వర్థమాన సమాజం అధ్యక్షునిగా పని చేశారు. పెన్షనర్ల సంఘంతోపాటు, రోటరీ క్లబ్‌కు కూడా అధ్యక్షునిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

***

నెల్లూరు పొగతోటలోని శ్రీనివాస హైరర్స్ అధినేత వెంకటశేషయ్య భార్య పసుమర్తి జోతమ్మ (68) 19వ తేది మరణించారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె.

ఆత్మీయులను కోల్పోయిన పై రెండు కుటుంబాల వారికి మా సానుభూతి.

జనవాణి

2వ పేజీ కొరవ

రోడ్డును దురాక్రమించినా తొలగించలేని అసమర్థులుగా కార్పొరేషన్ సిబ్బంది తయారైతే ఎలా?

ఎ.శౌరి, నెల్లూరు

ఓటు లేకుండా చేస్తున్నారు!

నెల్లూరు జొన్నలగడ్డవారి వీధిలోని 16/21 నెంబరుగల ఇంటిలో గత 26ఏళ్లుగా నివసిస్తున్నాను. కాని ఇప్పటి వరకు మా కుటుంబసభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో లేవు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్ని వివరాలతో ఎమ్మార్వో కార్యాలయంలో ఓటుకు దరఖాస్తు పెట్టాను. కాని మా కుటుంబం ఓట్లు తొలగింపు జాబితాలో పెట్టారు. ఎవరోపని కట్టుకొని మా కుటుంబ సభ్యులకు ఓటు లేకుండా చేస్తున్నారు. ఎమ్మార్వో కార్యాలయం అధికారులు ఈసారైనా మా కుటుంబానికి ఓటు హక్కు కల్పించమని వేడుకొంటున్నాను.

బాధితుడు, నెల్లూరు

రైతు చైతన్య యాత్రలతో ప్రయోజనం చేకూరేనా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రైతు చైతన్య యాత్రలు నిర్వహిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఈ రైతు చైతన్య యాత్రలు రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం చేకూర్చిపెట్టడం లేదు. ఈ చైతన్య యాత్రలకు ప్రతి సంవత్సరం లక్షలాదిరూపాయలు జిల్లాలో ఖర్చు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధ్వర్యంలో ఈ నెల 17వ తేది నుంచి ప్రారంభమైన రైతు చైతన్యయాత్రలు 17రోజుల పాటు గ్రామీణ ప్రాంతాలలో కొనసాగుతాయి.

రైతు చైతన్య యాత్రల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో సాగుభూములకు సంబంధించి మట్టి నమూనాలను సేకరించడం, వరి సాగుపై ప్రచారం నిర్వహించడంతోపాటు రైతులకు అవగాహన కల్పించడం చేయాల్సి వుంటుంది. అలాగే పంటరుణాలు ఇప్పటివరకు పొందని రైతులను గుర్తించి రుణం మంజూరు కోసం జాబితాను రూపొందించి బ్యాంకులకు అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. అయితే ఇందుకు భిన్నంగా వ్యవసాయశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు.

వాహనాలకు బ్యానర్లు, మైకులను ఏర్పాటుచేసుకొని గ్రామాలలో తిరుగుతూ ప్రచారం చేసుకుంటూ వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు అధికారులు వెళ్లే సమయంలో రైతులు ఎవరూ ఇళ్ల దగ్గర వుండడం లేదు. రెండవ పంట వేసే క్రమంలో రైతులు పొలాల్లో సన్నాహాలు చేసుకుంటున్నారు. రెండవ పంట వేసుకునే సమయంలో అధికారులు ఏ మేరకు రైతుల్ని చైతన్యవంతుల్ని చేస్తారో వారికే తెలియాలి. ఇప్పటి సాగుబడికి అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని రైతులు సిద్ధం చేసుకొని వున్నారు. ఇప్పుడు చైతన్యయాత్రల పేరిట ఏ రకం పంటల్ని వేయాలో అధికారులు ఎలా చెబుతారో అర్థం కావడం లేదు.

సాగుబడికి ముందు రైతుల్ని ఒకచోట సమావేశపరచి ఏ రకం పంటల్ని వేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్న విషయాన్ని తెలియజేసి వుంటే కొంతమేర రైతులకు వుపయోగకరంగా వుండేది. ఇంతేకాకుండా వేసిన వరి పంటకు ఎంత మోతాదులో పురుగుమందులు, రసాయనిక ఎరువులు వాడాలో వివరించే అవకాశం కలిగేది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకోకుండా గ్రామాల్లోకి వెళుతున్న అధికారులు నిరాశతో వెనక్కు రావాల్సిన పరిస్థితి తలెత్తింది. ఒకవేళ సమావేశం నిర్వహించాల్సి వస్తే గ్రామంలో అందుబాటులో వున్న వారితోనే సమావేశం ఏర్పాటు చేస్తున్నారు.

గత సంవత్సరం నిర్వహించిన రైతు చైతన్య యాత్రల ద్వారా ఏం సాధించామన్న దాన్ని అధికారుల బేరీజు వేసుకోవడం లేదు. వ్యవసాయ శాఖ గుర్తించిన ఆదర్శ రైతులు కూడా అందుబాటులో లేకుండా పోతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రైతు చైతన్యయాత్రల నిర్వహణకు ఒక్కో మండలానికి 17వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ఈ యాత్రలకు సంబంధించి నిధులు పూర్తిగా విడుదల జరగలేదు. మళ్లీ చైతన్యయాత్రలు ప్రారంభించడంతో పాత బకాయిల సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండల స్థాయిలో వుండే వ్యవసాయాధికారి ఖర్చుల్ని భరించాల్సి వుంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిధుల్ని విడుదల చేయకపోవడం కారణంగా మండలస్థాయి అధికారులపై ఆర్థిక భారం పడుతుంది. పాత బకాయిలే నేటికి చెల్లించకుండా ప్రస్తుతం జరుగుతున్న రైతు చైతన్యయాత్రలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వెళ్లాయి. రైతు చైతన్య యాత్రల కారణంగా రైతులు ఏ మాత్రం చైతన్యవంతులు కావడం లేదన్నది వాస్తవం.



రైతు చైతన్య యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకా, జిల్లా కలెక్టర్ రాంగోపాల్.

సముద్రంపై నిరసనకు దిగిన మత్స్యకారులు

కృష్ణపట్నం పోర్టులో మత్స్యకారులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోర్టు యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, జీవనోపాధి కల్పించాలని, ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు 17వ తేది పోర్టును ముట్టడించారు. సాధారణంగా చేసే ఆందోళనలకు భిన్నంగా నేల విడచి ఏకంగా సముద్రంపైనే ఫైబర్ బోట్లతో వందలాది మంది ముట్టడికి దిగడం చర్చనీయాంశమైంది.

ముత్తుకూరు, చిల్లకూరు మండలాలకు చెందిన మత్స్యకారులకే సహాయ ప్యాకేజీ అందజేసి, తమకు అందజేయక పోవడంపై తోటపల్లి గూడూరు, కోట, వాకాడు, ఇందుకూరుపేట మత్స్యకారులు చేపట్టిన ఆందోళనకు మంచి స్పందన లభించింది.

షుమారు 400 వందల మందికి పైగా మత్స్యకారులు సముద్రం మధ్యలోకి చేరుకొని పోర్టుకు వచ్చే విదేశీ నౌకలను అటకాయించారు. ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన మత్స్యకారులు ఈ ముట్టడిలో పాలుపంచుకోవడంతో పోర్టు యాజమాన్యం ఉలిక్కిపడింది. ఈ ఆందోళన ఫలితంగా పోర్టులోకి నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు యాజమాన్యం మత్స్యకారులను శాంతపరచేందుకు నానాపాట్లు పడ్డారు.

కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుచేసే సందర్భంలో పలు మండలాలలోని మత్స్యకారులకు పరిహారం అందజేస్తామని, ప్రత్యేక ప్యాకేజీ క్రింద పునరావాసం ఏర్పాటు చేస్తామని, నగదు అందజేస్తామని పోర్టు యాజమాన్యం ప్రకటించింది. చిల్లకూరు, ముత్తుకూరు మండలాలల్లోని మత్స్యకారులకు మాత్రం పునరావాసం కల్పించారని, లక్షరూపాయల నగదు చెల్లించారని, తమ పట్ల మాత్రం పక్షపాతంగా వ్యవహరించారని ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, కోట, వాకాడు మండలాల మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. జీవనాధారమైన వేటను కోల్పోయామని, అన్నివిధాలా నష్టపోయిన తమను ఆదుకోవడంలో పోర్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందువల్లే ముట్టడికి దిగాల్సి వచ్చిందని మత్స్యకారులు వ్యాఖ్యానించారు. ఈ ఆందోళన సందర్భంగా మత్స్యకారులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ముత్తుకూరు, చిల్లకూరు మండలాలకు చెందిన మత్స్యకారులు పోర్టు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించగా, ఇతర మండలాల మత్స్యకారులు ఆందోళనలో పాలు పంచుకోవడంతో ఉద్రిక్తత నెలకొనింది. చివరకు కలెక్టర్ రాంగోపాల్ జోక్యం చేసుకొని తాత్కాలికంగా మత్స్యకారులను శాంతపరచడంతో పోర్టులో నౌకల రాకపోకలకు ఆస్కారం ఏర్పడింది.

పోర్టు, వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు కారణంగా తాము ఉనికి కోల్పోతున్నామన్నది మత్స్యకార కుటుంబాల్లో వ్యక్తమవుతున్న ఆందోళన. గతంలో వేట సాగించుకొనేందుకు ఎంతో వీలుగా వుండేదని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని, గ్రామాలలో నుంచి సముద్రంలోకి వెళ్లేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయని, చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, పునరావాసం, ప్యాకేజీలు అందకపోవడంతో విసిగి వేసారి సముద్రంపై ముట్టడికి దిగాల్సి వచ్చిందని మత్స్యకారులు చెప్తున్నారు. 17వ తేది జరిపిన ముట్టడి ద్వారా మత్స్యకారులు అధికారగణానికి, పోర్టు యాజమాన్యానికి ముచ్చెమటలు పట్టించారు.


కృష్ణపట్నం పోర్టును పడవలతో ముట్టడించిన మత్స్యకారులు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

● చిరంజీవిలో


చిగురిస్తున్న ఆశలు!

ఏడాది కాలంపాటు హాయిగా ఇంటి పట్టునే వుండి, ఎప్పుడు అవకాశం చిక్కితే అప్పుడు ప్రజారాజ్యం అంగడికి మూత వేసి పోదామా అని ఎదురు చూస్తుండిన చిరంజీవి వున్నట్లుండి పోలవరం యాత్ర పేరుతో జనంలోకి ఎందుకు వెళ్తున్నాడన్నది పరిశీలకులను వేధిస్తున్న ప్రశ్న. చిరంజీవికి అసలు రాజకీయాలలోకి రావడమే ఇష్టం లేదన్న నిజం లోకానికంతా తెలుసు. 2009 ఎన్నికల నాటికి రాష్ట్రంలో నెలకొని వున్న రాజకీయ పరిస్థితులు, కుల ప్రాధాన్యతలతో కొందరు నేతలు ఆయన్ను బలవంతంగా గోదాలోకి దించారు. ఎన్నికలలో చావుదెబ్బ తగలడంతో ఇక తాను బంధ విముక్తుడనైనట్లే భావించడాయన. ఏదో ఒక మంచి ముహూర్తం చూసుకొని పక్కకు తప్పుకోవాలని ఆలోచన చేస్తుండినాడు.

అయితే వైఎస్ జగన్ ఓదార్పు యాత్రలు విజయవంతం కావడంతో చిరంజీవి సన్నిహితులకు కన్ను కుట్టింది. వారి బుర్రలో పురుగు దొల్చింది. జగన్ ఎంతో కాలం కాంగ్రెస్‌తో కలిసి ఉండలేడని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చీలిపోవడం ఖాయమని, ఆ సంక్షోభ సమయంలో రాజకీయ లబ్ధిపొందే అవకాశం ఒక్క చిరంజీవికి మాత్రమే వుందని వీరి భావన అట. రాష్ట్ర ప్రజానీకంలో జగన్ కంటే అధికంగా చిరంజీవికి ఆకర్షణ శక్తి వుందన్న మాట నిజం. అంతటి నాయకుడు మరే పార్టీలోనూ లేడు. రాజకీయ అనుభవశూన్యంతో గత ఎన్నికలలో దెబ్బతిన్నా, మరొకసారి ప్రయత్నిస్తే రాజ్యాధికారం మీదే అవుతుందని వీరు చిరంజీవి చెవిలో ఇల్లు కట్టుకొని పోరారట. వారి మాటలతో ఆయనలో మళ్లీ ఆశలు చిగురించాయి. ఎర్రటి ఎండలలో జగన్ వంటి యువకుడు ప్రయత్నాలు చేయగాలేనిది, తానెందుకు తిరగకూడదనే ఆలోచనతో చిరంజీవి ఈ యాత్ర తలపెట్టాడని చెప్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తి, ఎన్నికలు అనివార్యమైతే, సిద్ధంగా వుండడానికే ఆయన ఈ పర్యటన ప్రారంభించారని విశ్వసనీయ వర్తమానం. దానికి తగినట్లే ఆయనకు పోలవరం గ్రామాలలో మంచి జనాదరణ లభించింది. ఆ

కొరవ 14వ పేజీలో





Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.